

## ఉప ఎన్నికలు వస్తే.. మళ్లీ పోటీ చేస్తా

- నేను భయపడ.. ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం ఉంది
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాట్ కామెంట్స్

02



## శ్రీధర్ బాబుతో దానం నాగేందర్ భేటీ

- రాజీనామాపై నేడు స్పష్టత

02

## డీసీసీలకు కొత్త అధ్యక్షులు

- 33 జిల్లాలు.. మూడు కార్పొరేషన్లకు నియామకం
- కూర్పుపై ముఖ్యనేతల్లో విస్మయం
- రంగారెడ్డి, సంగారెడ్డి పెండింగ్.. నలుగురు ఎమ్మెల్యేలకు ఛాన్స్



02


Follow: @ANNTELUGU

23-11-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 335 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

## మళ్లీ ఉప ఎన్నికల రాగాలు

తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ వేడి పెరుగుతోంది. సాదారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయమున్నా.. మళ్ళీ ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికల హడావుడి కనిపిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా, దానం నాగేందర్, కడియం శ్రీహరిల రాజీనామాలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఫార్ములాఈ రేసు విచారణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అధికార – ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు జరుగుతున్నాయి. కేటీఆర్ అరెస్ట్ జరగకపోవచ్చని, విచారణపేరుతో కాలయాపన తప్ప తేల్చే ఉద్దేశం సర్కారుకు లేదన్న మాటలు వినబడుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గందరగోళాలు, ఎత్తులు పై ఎత్తులు షాకింగ్ గా మారాయి. బీజేపీలోనూ అంతర్గత ప్రజాస్వామ్యం మైకుల సాక్షిగా ప్రవహిస్తుండగా, కవిత జనంబాటను వ్యూహాత్మకంగా కొనసాగిస్తున్నారు. తరచూ బీఆర్ఎస్ ను కౌంటర్లు, ఎన్ కౌంటర్లతో సవాల్ చేసిన వారికి పెనుసవాల్ గా మారారు. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ హైదరాబాద్ లో ప్రదర్శన, బెంగుళూరులో జగన్, కేటీఆర్ ల భేటీ రాజకీయ మార్పులకు సరికొత్త సంకేతంగా కనబడుతోంది.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో



## గుర్తు లేదు.. మర్చిపోయా!

- పోలీసుల ప్రశ్నలకు ఐ బొమ్మ రవి పొంతన లేని సమాధానాలు
- ప్రతీ 20 రోజులకు రవి ఒక్కో దేశానికి వెళ్తున్నట్లు గుర్తింపు
- దీనిపై ఆరా తీస్తే విదేశీ పర్యటనలంటే ఇష్టమని పోలీసులకు సమాధానం

వివరాలు 8లో



## జగన్, కేటీఆర్ ఒక్కటై.. బెంగుళూరులో వ్యూహారచన

### ఆసక్తికరంగా కలయిక.. సోషల్ మీడియాలో వైరల్

భవిష్యత్ కార్యాచరణపై ఇరువురు నేతల సమాలోచనలు

ఏపీ, తెలంగాణ పాలిటిక్స్ ఒకదానిపై మరొకటి ప్రభావం

**హైదరాబాద్, మహా :** తెలుగు రాజకీయాల్లో ఓ సంచలనం.. ఓ సరికొత్త రాజకీయ సమీకరణం. ఏపీ, తెలంగాణలలో అధికారం కోల్పోయిన చాలా రోజుల తర్వాత.. ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బెంగళూరులో ఒకే వేదికపై కలుసుకోవడం తెలుగు రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వీరిద్దరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పక్కపక్కనే కూర్చొని కాసేపు సరదాగా ముచ్చటించుకున్నారు. వీరిద్దరూ మాట్లాడుకుంటున్న ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఇటీవల తెలంగాణలో కేసీఆర్ పాలనపై, హైదరాబాద్ అభివృద్ధిపై జగన్ ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. వీరిద్దరి భేటీకి రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఇది పూర్తిగా వ్యక్తిగత పర్యటన అని, రాజకీయాలకు సంబంధించినది కాదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ ఓటమితో షాక్ కు గురైన కేటీఆర్.. సరికొత్త రాజకీయ ఎత్తుగడలు అమలుచేస్తున్నారు. ఇదే క్రమంలో ఎన్డీఏ, కాంగ్రెస్ కు దూరంగా ఉన్న పార్టీలు భవిష్యత్తు కోసం కలిసిసాగుతున్నట్లు కనబడుతోంది. ఇటీవల చంద్రబాబు, వెంకయ్యనాయుడు లతో కలిసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఓ కార్యక్రమంలో కలిసి పాల్గొన్న ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఇపుడు ఇలా.. మరో జట్టు కలిసింది.

### యువ రైడర్లతో...

గుర్రప్పందాలు నిర్వహించే సర్జ్ స్టేబుల్ అనే కంపెనీకి చెందిన కార్యక్రమంలో ఇరువురు నేతలు పాల్గొన్నారు. కేటీఆర్, జగన్ ఇద్దరూ కలిసి గుర్రాల ఆకారంలో ఉన్న మెమెంటోలను యువ రైడర్లకు పంపిణీ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. "సర్జ్ స్టేబుల్" యువ రైడర్లు, గుర్రాలను ట్రైనింగ్ ఇచ్చి, షో జంపింగ్, డ్రెసేజ్ వంటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు తయారు చేసేలా పని చేస్తుంది. ఈక్వెస్ట్రియన్ స్పోర్ట్స్ ఇండియాలో రేర్. అయితే ధనవంతుల ఆటగా గుర్తింపు ఉంది.ఈ కార్యక్రమానికి ఇద్దరు నేతల్ని పిలవడం యాధృచ్ఛికమో లేకపోతే ఆ కంపెనీ ఓనర్ రెండు పార్టీలకు సన్నిహితుడు అయి ఉంటారని భావిస్తున్నారు. చాలా రోజుల తర్వాత జగన్, కేటీఆర్ బహిరంగంగా కలుసుకున్నారు. అది కూడా ప్రైవేటు కార్యక్రమంలో. జూబ్లిహిల్స్ ఎన్నికల కోసం కేటీఆర్ నారా లోకేష్ ను కలిశారన్న ప్రచారం జరిగింది. కానీ ఖండించలేదు. అయితే భేటీ జరిగే ఉంటుందని అనుకుంటున్నారు. ఇప్పుడు అనూహ్యంగా జగన్, కేటీఆర్ మధ్య భేటీ జరిగింది. ఈ వీడియోలు వెలుగులోకి వచ్చి వైరల్ అవుతున్నాయి.

## ఒకేసారి.. 37 మంది మావోయిస్టు అగ్రనేతలు

### డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట భారీ లొంగుబాటు

ఆజాద్ సహా ముగ్గురు స్టేట్ కమిటీ, ఏరియాల బాధ్యులు

మిగతా వారు కూడా లొంగిపోవాలన్న డీజీపీ శివధర్ రెడ్డి.. భారీగా ఆయుధాల సరెండర్



**హైదరాబాద్, మహా :** వరుస ఎన్ కౌంటర్లతో సతమతమవుతున్న మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. అజ్ఞాతంలో ఉన్న 37 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులను శనివారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నారాయణ అలియాస్ రమేశ్, రాష్ట్ర కమిటీ మరో సభ్యుడు సోమ్‌దా అలియాస్ ఎర్ర కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు. మిగతా వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, 9 మంది ఏరియా కమిటీ సభ్యులున్నన్నారు. లొంగిపోయిన వారి నుంచి రెండు ఏకే 47లు, 4 ఎస్ఎల్ఆర్‌లు, 303 తుపాకులు, 343 తూటాలు అప్పగించారని డీజీపీ ఈ సందర్భంగా తెలపారు. మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారేనని డీజీపీ తెలిపారు.

మిగతా 2లో



## నేడు పుట్టపర్తికి సీఎం రేవంత్ రెడ్డి

### శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలకు రేవంత్

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు పర్యటన నిమిత్తం పుట్టపర్తి చేరుకోనున్నారు. రాష్ట్రంలో పాలనాపరమైన కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో నిర్వహించనున్న కీలక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం ప్రాంగణంలో గల సాయి కుల్వంత్ హాల్‌లో నిర్వహిస్తున్న శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల వేడుకల్లో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి విచ్చేసిన సాయి భక్తులు, ప్రముఖులు, ఉన్నత అధికారులు పాల్గొననున్నారు.

## దమ్ముంటే ఆధారాలతో నిరూపించు లేదంటే క్షమాపణ చెప్పు

### ఏ ప్రభుత్వ భూమిని అమ్మకానికి పెట్టలేదు

- ముందు వాస్తవాలు తెలుసుకో
- 9292 ఎకరాల ఇండస్ట్రియల్ పార్కుల్లో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసింది 4740 ఎకరాలే
- హరీష్ రావు 'అవాస్తవాల'పై మంత్రి శ్రీధర్ బాబు స్ట్రాంగ్ కౌంటర్



02



## ఒకే కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్య

### అప్పుల బాధతో సూసైడ్.. అంబర్‌పేటలో తీవ్ర విషాదం

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అప్పుల బాధ తాళలేక భార్య, భర్త, పదేళ్ల కుమార్తె ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెండ్రోజుల క్రితమే బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయి. కొద్ది నెలల క్రితమే ఈ కుటుంబం రామ్‌నగర్ నుంచి అంబర్‌పేటకు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవలే పెద్ద కుమార్తె మరణించడం, మరోవైపు ఆర్థిక ఇబ్బందుల కారణంగానే కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ చరిత్రలో అందెశ్రీకి శాశ్వత స్థానం

### సహజకవి అందెశ్రీకి కోహినూర్ స్థాయి గౌరవం

'జయ జయహే తెలంగాణ' కవికి ఘన నివాళి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం

ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన అందెశ్రీని ప్రభుత్వం మరువదు

అందెశ్రీ సంతాప సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, మహా:** "వజ్రాల గురించి దశాబ్దాలు, శతాబ్దాలు చర్చించినా కోహినూర్ వజ్రానికి పోటీ లేనట్టే... కవులు, కళాకారులు ఎంత మంది ఉన్నా, ఎవరి గురించి చర్చించినా రేపటి తెలంగాణ చరిత్రలో అందెశ్రీ మొదటి స్థానంలో నిలబడతారు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన అందెశ్రీ సంతాప సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు.

మిగతా 2లో



## భూములను కొల్లగొట్టే స్కాములకు తెరలేపిన సీఎం

- రూ. 5 లక్షల కోట్ల భూమిని.. రూ. 5 వేల కోట్లకే కట్టబెట్టే కుట్ర
- టీజీఐఐసీ రేటు కాదని ఎస్సార్వోపై 30 శాతం మాత్రమే ఎందుకు?
- పేదవాడికి ఒక న్యాయం.. పెద్దోడికి మరో న్యాయమా?
- రెండు నెలల్లో స్కాం పూర్తికి రేవంత్ సర్కారు స్కెచ్
- పాలసీ వెనుక ఉన్న మతలబు ఏమిటి? 8 ప్రశ్నలతో హరీశ్ రావు సవాల్

వివరాలు 2లో




# భూములను కొల్లగొట్టే స్కాములకు తెరలేపిన సీఎం

- రూ. 5 లక్షల కోట్ల భూమిని.. రూ. 5 వేల కోట్లకే కట్టబెట్టే కుట్ర
- టీజీఐఐసీ రేటు కాదని ఎస్సార్వోపై 30 శాతం మాత్రమే ఎందుకు?
- పేదవాడికి ఒక న్యాయం.. పెద్దోడికి మరో న్యాయమా?
- రెండు నెలల్లో స్కాం పూర్తికి రేవంత్ సర్కారు స్కెచ్
- పాలసీ వెనుక ఉన్న మతలబు ఏమిటి? 8 ప్రశ్నలతో హరీశ్ రావు సవాల్




**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హిల్‌టీపీ) ఒక తాజా స్కాం అని, ఇది హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ లూటింగ్ పాలసీ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డగోలు దోపిడీ మీదే దృష్టి పెట్టారని, దాదాపు 10 వేల ఎకరాల భూమిని పప్పుబెల్లాల్లా అమ్ముకునే కుట్రకు తెరలేపారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో పెట్టుబడుల వార్తలు వచ్చేవని, కాంగ్రెస్ హయాంలో మాత్రం అమ్మకాల వార్తలు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్ రెడ్డి భూములు అమ్ముకుంటూ పోతే స్మశానాలకు కూడా స్థలం మిగలదన్నారని గుర్తు చేస్తూ, ఇప్పుడు సుద్ద పూసలా మాట్లాడి భూములు తెగనమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కొత్త పాలసీ దేశంలోనే అతిపెద్ద భూ కుంభకోణమని హరీశ్ రావు అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు చెప్పిన లెక్కల ప్రకారమే 9,292 ఎకరాల భూమిని కేవలం 30% ఎస్సార్వో ధరకు రెగ్యులరైజ్ చేయడం ద్వారా రూ. 5 వేల కోట్లు మాత్రమే ప్రభుత్వానికి వస్తున్నాయని, కానీ ఈ భూముల ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు రూ. 5 లక్షల కోట్లు ఉంటుందని లెక్క కట్టారు. దీనిని బట్టి, మిగతా రూ. 4.95 లక్షల కోట్లు 'స్కాం' కాదా అని ప్రశ్నించారు. ఈ భూ కుంభకోణం పరిధిని తగ్గించే ప్రయత్నంలో మంత్రి శ్రీధర్ బాబు తప్పుడు సమాచారం ఇస్తున్నారని, కేవలం 4,740 ఎకరాలేనని బుకాయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌తో పోల్చితే ఈ స్కాం రెండు రెట్లు ఎక్కువని, ఇంత పెద్ద నిర్ణయాన్ని అసెంబ్లీలో చర్చించకుండా రాత్రికి రాత్రే చేయడంపై ఆయన మండిపడ్డారు.

**ప్రభుత్వంపై 8 ప్రశ్నలతో సవాల్:**

ఈ పాలసీ వెనుక ఉన్న మతలబుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని హరీశ్ రావు బీఆర్ఎస్ పక్షాన 8 ప్రశ్నలను సంధించారు. 1. టీజీఐఐసీ రేటు కంటే తక్కువగా ఉన్న ఎస్సార్వో రేటులో కేవలం 30% మాత్రమే ఎందుకు తీసుకుంటున్నారు? 2. త్వరలో ఎస్సార్వో ధరలు పెంచుతామని చెప్పి, అది అమలులోకి రాకముందే ఈ పాలసీని ఎవరి మేలు కోసం హడావుడిగా తీసుకొచ్చారు? 3. బీఆర్ఎస్ ప్రభుత్వం వంద రూపాయలు తీసుకొని ఖజానా నింపితే, మీరు ఎందుకు ₹30కే తగ్గించి లక్షల కోట్ల నష్టం కలిగిస్తున్నారు? 4. పేదవాడు కొన్న కొద్ది గజాల భూమికి సైతం ఎస్సార్వోపై 6080% ఎల్ఆర్ఎస్ వసూలు చేసి, ధనవంతులకు 30%కే మల్టిపుల్ జోన్‌గా మార్చడం పేదోడికి ఒక న్యాయం, పెద్దోడికి ఒక న్యాయం కాదా? 5. ఈ 30%లో ఆల్ ప్రాసెసింగ్ ఫీజులు కూడా కలిపి హెచ్ఎండీఏకు రావాల్సిన రూ. 13,500 కోట్లు రాకుండా చేశారా? 6. ఓఆర్ఆర్ లోపల మాత్రమే కాదు, చుట్టుపక్కల భూములు కొల్లగొట్టే కుట్ర ఈ పాలసీలో ఉందా? ఇది రేవంత్ రెడ్డి ఫ్యామిలీ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ కాదా? 7. ఆరు నెలల కిందనే దీనికి రూపకల్పన చేసి అనుముల బ్రదర్స్ అగ్రిమెంట్లు చేసుకున్నారనేది నిజం కాదా? 8. వచ్చే 30% డబ్బును కొత్త పరిశ్రమలకు వాడుతారా లేక కాంట్రాక్టర్ల బిల్లుల కోసం వాడుతారా?

**అసెంబ్లీలో చర్చకు డిమాండ్..**

'ఇది మీ అయ్య జాగీరు కాదు, నాలుగు కోట్ల ప్రజల ఆస్తి' అని ముఖ్యమంత్రిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం కలిగించే ఈ పాలసీని వెంటనే అసెంబ్లీలో చర్చకు పెట్టాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. పారిశ్రామిక వేత్తలకు తాము ఇన్సెంటివ్‌లు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం బిల్డర్లు, వ్యాపారుల కోసం భూములు అమ్మడానికి 'హిల్‌టీపీ' పాలసీ తెచ్చిందని విమర్శించారు. కేటీఆర్ అడిగిన ప్రశ్నలకు, తాను అడిగిన ఎనిమిది ప్రశ్నలకు నిజాయితీ ఉంటే ప్రభుత్వం సమాధానం చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. లేకపోతే, ప్రజల హక్కులు, ఆస్తులు కాపాడటం ప్రతిపక్షంగా తమ బాధ్యత అని, ప్రజా క్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## గుర్తు లేదు.. మర్చిపోయా!

- పోలీసుల ప్రశ్నలకు ఐ బొమ్మ రవి పొంతన లేని సమాధానాలు
- ప్రతీ 20 రోజులకు రవి ఒక్కో దేశానికి వెళ్తున్నట్లు గుర్తింపు
- దీనిపై ఆరా తీస్తే విదేశీ పర్యటనలంటే ఇష్టమని పోలీసులకు సమాధానం



**హైదరాబాద్, మహా:** సినిమాల పైరసీ కేసులో ఐ బొమ్మ ఇమంది రవి పోలీసుల విచారణ శనివారం మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా పైరసీ ఇమంది రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీశారు. పైరసీకి ఎవరు సహకారం అందిస్తున్నారు.. తెర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారనే విషయాలపై పోలీసులు ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐ బొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్‌లో అప్‌లోడ్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. అయితే, విచారణలో పోలీసులకు రవి సహకరించడం లేదని సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెబుతున్నాడని తెలిసింది. యూజర్ ఐడీ, పాస్‌వర్డులు అడిగితే గుర్తు లేదు.. మరిచిపోయానని రవి సమాధానం చెప్పినట్లు సమాచారం. ఎథికల్ హ్యాకర్ల సహాయంతో హార్డ్‌డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లను పోలీసులు ఓపెన్ చేస్తున్నారు. ఫ్రాన్స్, నెదర్లాండ్‌లో మెయిన్ సర్వర్లు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల విషయంలోనూ రవి నోరువిప్పలేదని.. రవి అకౌంట్ల వివరాలు ఇవ్వాలని పలు బ్యాంకులకు పోలీసులు మెయిల్ పంపారు. ప్రతీ 20 రోజులకు ఒక్కో దేశానికి రవి వెళ్లాడని.. దీనిపై ప్రశ్నిస్తే తనకు విదేశీ పర్యటనలంటే ఇష్టమని.. అందుకే వెళ్లాలని రవి చెప్పినట్లు తెలియవచ్చింది. రవి పర్యటించిన దేశాల్లో పైరసీ లింకుల కూపీ లాగుతున్నారు పోలీసులు.

## డీసీసీలకు కొత్త అధ్యక్షులు

- 33 జిల్లాలు.. మూడు కార్పోరేషన్లకు నియామకం
- కూర్పుపై ముఖ్యనేతల్లో విస్మయం
- రంగారెడ్డి, సంగారెడ్డి పెండింగ్.. నలుగురు ఎమ్మెల్యేలకు ఛాన్స్

**ఢిల్లీ, మహా :** తెలంగాణ డీసీసీ లకు కొత్త అధ్యక్షులను ఏఐసీసీ ప్రకటించింది. మొత్తం 33 జిల్లాలకు, మూడు కార్పొరేషన్లకు (కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్) లకు డీసీసీ అధ్యక్షులను నియమించి వారి పేర్లను విడుదల చేసింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిధిలోని జిల్లాల కాంగ్రెస్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కాగా డీసీసీల కూర్పుపై ముఖ్యనేతల్లో విస్మయం వ్యక్తమవుతోంది. కాగా, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా లలకు డీసీసీలను ఏఐసీసీ ప్రకటించలేదు. ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్యకు యాదాద్రి డీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు అప్పచెప్పిన ఏఐసీసీ.., నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే వంశీ, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే బొజ్జు, పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌లను నియమించింది.

## ఉప ఎన్నికలు వస్తే.. మళ్లీ పోటీ చేస్తా

### నేను భయపడ.. ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం ఉంది
### స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపుల విచారణ కొనసాగుతున్న వేళ కడియం శ్రీహరి స్పందించారు. పరిస్థితులను బట్టే తన నిర్ణయం ఉంటుందంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారాయన. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. "నిన్న స్పీకర్‌ని కలిసి కొంత సమయం ఇవ్వాలని కోరాను. దానికి వారు సానుకూలంగా స్పందించారు. ఆయన ఎంత సమయం ఇస్తారో ఇవాళ తెలుస్తుంది. సమాధానం ఇవ్వకపోవడానికి ఎలాంటి ప్రత్యేక కారణాలు లేవు. శ్రేయోభిలాషులు, నియోజకవర్గ ప్రజలు, న్యాయ నిపుణులతో చర్చించి సలహాలు తీసుకుంటున్నాను. స్పీకర్ నిర్ణయం.. పరిస్థితులను బట్టే నా నిర్ణయం ఉంటుంది'' అని కడియం స్పష్టత ఇచ్చారు. రాజీనామా, ఉప ఎన్నిక అంశంపై మాట్లాడుతూ.. తన రాజీనామాపై ప్రతిపక్షాలు చాలా కుతూహలంతో ఉన్నాయని కామెంట్ చేశారు. అయితే ఉప ఎన్నికలు వచ్చినా అభ్యర్థిగా తానే ఉంటానని.. గెలిచి తీరతానని కడియం ధీమా వ్యక్తం చేశారు.

## శ్రీధర్ బాబుతో దానం నాగేందర్ భేటీ

### రాజీనామాపై నేడు స్పష్టత

**హైదరాబాద్, మహా:** ఢిల్లీలో ఏఐసీసీ పెద్దలను కలిసిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్ బాబును కలిసి చర్చించారు. స్పీకర్ అనర్హత అంశంలో నోటీసులు జారీచేసిన నేపథ్యంలో దానికి ఎలా స్పందించాలి? రాజీనామా అనివార్యమా? గడువు కోరవచ్చా? న్యాయనిపుణులు ఏమంటున్నారు అన్న అంశాలపై చర్చించారు. స్పీకర్ ఇచ్చిన గడువు ఆదివారంతో ముగియనుండగా, దానం అడుగులపై స్పష్టత రానుంది. రాజీనామాకు దానం సిద్దంగా ఉండగా, పార్టీ నుండి ప్రభుత్వం నుండి రక్షణ కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. మంత్రి పదవి , ఎమ్మెల్యే టికెట్, ఎన్నికను ఎదుర్కోవడం వంటి అనేక అంశాలపై అధిష్టానంతో చర్చలు జరిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.

## ఒకేసారి.. 37 మంది మావోయిస్టు అగ్రనేతలు

### డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట భారీ లొంగుబాటు
### ఆజాద్ సహా ముగ్గురు స్టేట్ కమిటీ, ఏరియాల బాధ్యులు
### మిగతా వారు కూడా లొంగిపోవాలన్న డీజీపీ శివధర్ రెడ్డి.. భారీగా ఆయుధాల సరెండర్

(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం డివిజనల్ కమిటీకి చెందిన వారు 9 మంది, దక్షిణ బస్తర్ కమిటీకి చెందిన వారు 22 మంది ఉన్నట్లు వివరించారు. పార్టీ పరమైన విభేదాలు, భద్రతాపరమైన సమస్యలు, అనారోగ్య కారణాల వల్ల మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ చెప్పారు. లొంగిపోయిన వారికి నిబంధనల ప్రకారం పునరావాస ప్యాకేజీ అందిస్తామని డీజీపీ తెలిపారు. కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్‌పై రూ.20 లక్షల రివార్డు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఇలా లొంగిపోయిన అందరిపై కలిపి రూ.1.41 కోట్ల రివార్డు ఉందని, అది వారికే అందజేస్తామని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ కూడా అందిస్తామని పేర్కొన్నారు. సెంట్రల్ కమిటీలో తెలంగాణ వాళ్లు ఇంకా ఐదుగురు ఉన్నారని, మిగతా వాళ్లు కూడా త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నట్లు తెలిపారు.

అజ్ఞాతంలో ఉన్న వారు బయటకు ఎంత త్వరగా వస్తే అంత మంచిదని డీజీపీ అన్నారు. రాష్ట్రానికి చెందిన 59 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 10 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారన్నారు. ప్రభుత్వ, రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు, మీడియా ఇలా ఎవరి ద్వారా అయినా మావోయిస్టులు బయటికి రావచ్చన్నారు. ఇటీవల జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని సీఎం రేవంత్ రెడ్డి కూడా పిలుపునిచ్చారని డీజీపీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ సెంట్రల్ కమిటీలో ఉన్నారని డీజీపీ చెప్పారు. పోలీసుల ముందుకు వచ్చిన వారికి పూర్తి భద్రత ఉంటుందని, లొంగిపోయిన వారికి ఎలాంటి వేధింపులుండవని హామీ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీని దేవ్‌జీ లీడ్ చేస్తున్నారని చెప్పేందుకు కచ్చితమైన సమాచారం లేదని, దేవ్‌జీ, గణపతి కూడా లొంగిపోయేందుకు వస్తే సంతోషిస్తామన్నారు. హిడ్మా లొంగిపోయిన తర్వాత పోలీసులు కాల్చి చంపేశారనేది వాస్తవం కాదన్నారు. గడిచిన 11 నెలల్లో 465 మంది మావోయిస్టులు రాష్ట్ర ప్రభుత్వం ఎదుట లొంగిపోయారని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న వారిలో తెలంగాణకు చెందిన వారు 59 మంది ఉన్నారన్నారు.

**మిగతా వారు కూడా లొంగిపొండి : ఆజాద్**

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు సోదరులు ఎంత త్వరగా లొంగిపోతే అంత మంచిదని ఆజాద్ అన్నారు. మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి ఎవరనేది తమకు ఇంకా తెలియదని చెప్పారు. పార్టీకి చెప్పిన తర్వాతే లొంగిపోయామనిన్నారు. అయితే ఆయుధాలు పార్టీకి అప్పగించకుండా లొంగిపోవడంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.

## దమ్ముంటే ఆధారాలతో నిరూపించు లేదంటే క్షమాపణ చెప్పు



**హైదరాబాద్, మహా:** 'ఆరోపణలు చేయడం, అబద్ధాలు ప్రచారం చేయడం బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావుకు వెన్నతో పెట్టిన విద్య' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. తిమ్మిని బమ్మిని చేయడంలో వారిని మించిన వారు మరొకరు లేరని మరోసారి నిరూపించుకున్నారంటూ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎద్దేశా చేశారు. వారు పదేపదే ప్రస్తావిస్తున్న రూ.5 లక్షల కోట్ల స్కాం ఆరోపణ పూర్తిగా నిరాధారం, అవాస్తవమని మరోసారి స్పష్టం చేశారు. దమ్ముంటే ఆధారాలను బయట పెట్టి మాట్లాడాలని సవాలు విసిరారు. లేదంటే.. మీరు పదే పదే చేస్తున్న ప్రచారం కేవలం పచ్చి అబద్ధం, రాజకీయ దురుద్దేశం అని ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'మీరు అధికారం కోల్పోయారనే బాధతో రూ. 5 లక్షల కోట్ల స్కాం అంటూ పాత రికార్డును పదే పదే వాయించే బదులు మీరు ఆగస్టు 2023లో తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోల (19, 20, 21) వెనుక ఉన్న 'రూ. లక్షల కోట్ల మతలబు' గురించి ముందు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి' అని ఆయన డిమాండ్ చేశారు.

గతంలో మంత్రిగా సుదీర్ఘ అనుభవమున్న హరీష్ రావు తమ ప్రభుత్వంపై ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పారదర్శకంగా రాష్ట్ర ఖజానాకు రూ. 4వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు తాము ప్రయత్నిస్తుంటే... స్కాంలు చేసి చేసి అలవాటైన బీఆర్ఎస్ నేతలకు మాత్రం ఇది మింగుడు పడటం లేదన్నారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రభుత్వ లీజ్ ల్యాండ్స్ కు ఫ్రీహోల్డ్ రైట్స్ ఇచ్చి, 100 శాతం, 200 శాతం ఛార్జీలు విధించి మీరు వసూలు చేద్దామనుకున్న రూ.లక్షల కోట్ల సంగతేంటంటూ ప్రశ్నించారు. అసలు ప్రభుత్వంతో సంబంధం లేని సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు నమ్ముతారనే భ్రమ నుంచి బయటకు రావాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా యువతకు ఉద్యోగాలు దక్కకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. వాస్తవాలను దాచిపెట్టి తమ ప్రభుత్వం 9292 ఎకరాలు అమ్మకానికి పెట్టిందంటూ తమపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ భూముల్లో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసిన ఏరియా లేదా ఫ్రీ హోల్డ్ ప్రాపర్టీస్ కేవలం 4,740 ఎకరాలేనని, ఇవి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూములని స్పష్టం చేశారు. మిగిలిన భూములు రోడ్లు, డ్రెయినేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా నిజనిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

## తెలంగాణ చరిత్రలో అందెశ్రీకి శాశ్వత స్థానం

### సహజకవి అందెశ్రీకి కోహినూర్ స్థాయి గౌరవం
### 'జయ జయహే తెలంగాణ' కవికి ఘన నివాళి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం
### ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన అందెశ్రీని ప్రభుత్వం మరువదు
### అందెశ్రీ సంతాప సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)




జీవితంలో బడి ముఖమే చూడని సహజకవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతం ఈ రోజు ప్రతి బడిలో పాడుకునేంతగా యావత్ తెలంగాణ సమాజాన్ని ప్రభావితం చేసిందని కొనియాడారు. బడి ముఖమే చూడని అందెశ్రీ అన్న 'జయ జయహే తెలంగాణ' అంటూ ముక్కోటి గొంతుకలను ఏకం చేసి తెలంగాణ ఉద్యమాన్ని నడిపితేనే రాష్ట్ర కల నిజమైంది. నాలుగు కోట్ల ప్రజలు కోరుకున్న ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా, ప్రజా ప్రభుత్వం దానిని పాఠ్య పుస్తకాల్లో మొదటి అంశంగా చేర్చింది. ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన అందెశ్రీని, ఆయన పోరాటాన్ని ప్రభుత్వం ఎన్నటికీ మరువబోదని ముఖ్యమంత్రి ప్రకటించారు. సర్వం త్యాగం చేసి ఏమీ ఆశించకుండా 5 దశాబ్దాల పాటు పని చేసిన ఆ కుటుంబాన్ని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అందెశ్రీ కీర్తిని తెలంగాణ చరిత్రలో శాశ్వతం చేయడంతో పాటు, ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అందెశ్రీ కుటుంబంలో ఉద్యోగం ఇవ్వడంతో పాటు స్మృతివనం కట్టాలనుకున్నామని, ఆయన రాసిన నిప్పుల వాగు పుస్తకాన్ని ప్రతి లైబ్రరీలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతేకాక, అందెశ్రీ పేరిట జానపద విశ్వ విద్యాలయం ఏర్పాటుతో పాటు సభలో వక్తలు చేసిన ఇతర సూచనలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 9 మంది ఉద్యమ కారులు, కవులు, కళాకారులకు 300 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించామని, వారు ఆత్మగౌరవంతో బతికేలా భారత్ ఫ్యూచర్ సిటీలో వారికి ఇండ్లు కట్టించే కార్యక్రమాన్ని చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం, అదిల్ ఉల్లా, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, అందెశ్రీ సతీమణి మల్లుబాయి, కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు పాల్గొని అందెశ్రీకి నివాళులర్పించారు.

## ఓటేయ్యకుంటే నిధులు ఇవ్వ

- మీ దగ్గర ఓట్లు ఉన్నాయి.. నా దగ్గర నిధులు ఉన్నాయి
- మీరు తిరస్కరిస్తే.. నేను కూడా తిరస్కరిస్తా
- మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ సంచలన కామెంట్స్

**మహారాష్ట్ర, మహా:** ఓటర్లను ఉద్దేశించి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్‌చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను తిరస్కరిస్తే.. నిధుల కేటాయింపు విషయంలో తానూ అదే పనిచేస్తానని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బారామతిలో నిర్వహించిన ప్రచారంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. 'స్థానికంగా ఎన్సీపీకి చెందిన 18 మంది అభ్యర్థులను గెలిపిస్తే.. ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తాను. హామీలను నెరవేర్చే విషయానికి కట్టుబడి ఉన్నాను. మీ దగ్గర ఓట్లు ఉన్నాయి. నా దగ్గర నిధులు ఉన్నాయి. మీరు తిరస్కరిస్తే.. నేను కూడా తిరస్కరిస్తా'' అని అజిత్‌పవార్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి కూడా ఆయనే కావడం గమనార్హం. అజిత్ పవార్‌వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఆయన ఓటర్లపై బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆరోపించాయి. "నిధులు అనేవి సామాన్య ప్రజలు కట్టిన పన్నుల నుంచి విడుదల చేస్తుంటారు. అజిత్‌పవార్‌ఇంటి నుంచి ఇవ్వరు. ఆయన ఓటర్లను బెదిరిస్తుంటే.. ఎన్నికల సంఘం ఏం చేస్తోంది?'' అని శివసేన (యూబీటీ) నేత అంబాదాస్‌ధన్వే ప్రశ్నించారు.

## రోడ్డుపైనే ధాన్యం ఆరబోత



**మహా కోదాడ:** మునగాల మండలం, కలకోవ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైతుల వ్యవసాయం ఉత్పత్తులను ఆరబోయడానికి రోడ్లను వినియోగించుకుంటున్నారు. వరి ధాన్యాన్ని ఆరబోయటానికి కల్లాలుగా వాడుకుంటున్నారు. కోసిన ధాన్యాన్ని ఆరబోసి, ధాన్యాన్ని సాయంత్రం కుప్పలుగా చేసి రాత్రిళ్లు అక్కడే ఉంచుతున్నారు. రాత్రి సమయంలో కుప్పలు గమనించకపోవడంతో వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతేడాది మండల పరిధిలోని రోడ్లపై ధాన్యం ఆరబోసిన రాశులు కనబడక బైకర్లు, ఆటోలు ఢీకోని ప్రమాదాలకు గురైనారు. ప్రస్తుతం మండలములోని పంటలను ఆరబోయడానికి రోడ్లను ఎంచుకున్నారు. రాత్రివేళ ప్రయాణమంటేనే భయమేస్తోంది. ఆలేటి మహేష్ ప్రయాణికుడు బైకుపై నిత్యం పనులు ముగించుకొని రాత్రి సమయాల్లో ఇంటికి వెళ్తుంటా. ఈ సీజన్లో రాత్రివేళ బైక్ నడపాలంటేనే భయమేస్తోంది. రోడ్లపై ధాన్యం కుప్పల మీద నల్లటి కవర్ కప్పడంతో రాత్రి సమయంతో బీటీ రోడ్డు మాదిరిగానే కనిపిస్తోంది. వాహనదారులు గమనించక పోతే ప్రమాదానికి గురికావాల్సిందే. రోడ్లపై కల్లాలు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలి. రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కల్పించాలని, వాహనాదారులు ప్రయాణికులు పోలీసులను కోరుతున్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా గురుకులం నిర్మాణం

## విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జిల పెంపు

- కోటి మంది మహిళలకు కోటి చీరల పంపిణీ
- మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పటిష్ట కార్యాచరణ
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క




**ఖమ్మం బ్యూరో, మహా:** అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా గురుకులాలను నిర్మిస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖా మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, టీజీ ఎస్పీడీసీఎల్ ఎండి కర్నాటి వరుణ్ రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ లతో కలిసి వైరాలో సుమారు 20 ఎకరాల స్థలంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణ పనులకు, వైరా నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో 18 కోట్ల 46 లక్షలతో చేపట్టిన ఏడు 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు, 58 కోట్ల 50 లక్షలతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గేమ్ చేంజర్ గా యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం నిలుస్తుందని అన్నారు. ప్రపంచ స్థాయి పోటీని ధీటుగా ఎదుర్కొనేలా మన విద్యార్థులను తయారు చేసేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా గురుకులాలు నిర్మిస్తున్నామని అన్నారు. ప్రతి యంగ్ ఇండియా స్కూల్ కు 20 ఎకరాల ప్రాంగణంలో 200 కోట్ల రూపాయలు ఖర్చు చేసి, సకల సదుపాయాలతో ఆంగ్లమాధ్యమంలో విద్యా బోధన ఉండేలా, విద్యా బోధన చేసే స్టాఫ్, ఇతర సిబ్బంది క్వార్టర్స్ సైతం అక్కడే నిర్మిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాలలో ప్రోత్సాహం అందించేలా చర్యలు చేపట్టామని అన్నారు. యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణానికి సంబంధించి 30 కోట్ల నిధులను కలెక్టర్ ఖాతాకు ఇప్పటికే విడుదల చేసామని, పనుల వేగం ఆధారంగా ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించుకొని బిల్లులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. గత 10 సంవత్సరాల కాలంలో అనేక ధరలు పెరిగిన డైట్ చార్జీలు, కాస్మోటిక్స్ చార్జిలను పెంచలేదని, పిల్లలు పోషకాహార లోపంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, దీనిని గమనించిన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జిలను పెంచడం జరిగిందని అన్నారు. గురుకులాల్లో పిల్లలకు మంచి ఆహారం పెట్టాలని లక్ష్యంతో నిష్ణాతులైన వైద్యులచే కామన్ డైట్ మెనూ తయారు చేసి పకడ్బందీగా అమలు చేస్తున్నామని అన్నారు. గురుకులాలను జిల్లా ఉన్నతాధికారులు రెగ్యులర్ గా తనిఖీ చేస్తూ చిన్న, చిన్న సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు. ప్రపంచానికి దశ, దిశ నిర్దేశించి స్థాయికి మన విద్యార్థులు ఎదిగేందుకు అవసరమైన ఏర్పాట్లను యంగ్ ఇండియా గురుకులాల్లో కల్పిస్తున్నామని అన్నారు.

కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, మహిళలు కట్టుకునే విధంగా నాణ్యమైన చీరలు అందిస్తున్నామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ఇందిరా క్రాంతి పథకం క్రింద వడ్డీ లేని రుణాలు అందించామని, గత టిఆర్ఎస్ హాయంలో వడ్డీ లేని రుణాలు పథకం నిర్వీర్యం చేసిందని తెలిపారు. 5 సంవత్సరాల కాలంలో లక్ష కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజీ రుణాలు మహిళలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకొని, ఇప్పటివరకు 27 వేల కోట్ల వడ్డి లేని రుణాలు అందించామని అన్నారు. పెట్రోల్ పంపు, సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీకి అద్దె బస్సుల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇందిరమ్మ క్యాంటీన్ల ఏర్పాటు వంటి అనేక వ్యాపార అవకాశాలను మహిళా సంఘాలకు తమ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. మహిళల చేతిలో డబ్బులు ఉంటే కుటుంబ వ్యవస్థ బాగుపడుతుందని తమ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు. 53 లక్షల నిరుపేద కుటుంబాలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. వైరా నియోజకవర్గ పరిధిలో 52 వేల 19 కుటుంబాలు ఉచిత విద్యుత్ లబ్ధి పొందాయని, ప్రజల తరపున 36 కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. మహిళలు ఎక్కడికైనా ప్రయాణం చేసేలా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని అన్నారు. వైరా లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. వైరా రిజర్వాయర్ కాలువల లైనింగ్ పనులు జరుగుతున్నాయని, ఏ.టి.సి. ను సైతం మంజూరు చేసామని త్వరలోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. గిరిజన రైతుల కోసం ఇందిరా గిరి జల వికాసం క్రింద 5 వేల బోర్లను వేయడం జరిగిందని అన్నారు. టీజీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ శాఖ పరిధిలో గణనీయంగా విద్యుత్ డిమాండ్ పెరిగినా ఎటువంటి కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని అన్నారు. వైరా నియోజకవర్గ పరిధిలో ఏడు 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులు 18 కోట్ల 46 లక్షల వ్యయంతో శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. రాబోయే వేసవి కాలంలో కూడా ఎటువంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం భవనం, రోడ్డు అభివృద్ధి పనులు, 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణా లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఇది ఉపయోగ పడుతుందని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులం నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలలో ఎటువంటి రాజీ లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణ పనులు పర్యవేక్షించాలని అన్నారు. గురుకులం నిర్మాణ పనులకు అనుసంధానంగా అవసరమైన త్రాగునీటి, విద్యుత్ సరఫరా, ఇతర ఇన్ ఫ్రా పనులు చేపట్టామని అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మొదటి విడత గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం ప్రారంభించిందని, 18 సంవత్స రాలు నిండిన ప్రతి మహిళకు చీర అందుతుందని కలెక్టర్ తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాల కాలంలో 500 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని అన్నారు. సీతారామ కాలువల నుంచి వైరా ప్రాజెక్టుకు నీరు తరలించేందుకు రాజీవ్ లింక్ కెనాల్ నిర్మించామని, వైరా ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల మరమ్మత్తు కోసం నిధులు మంజూరు చేశారని, 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులం నిర్మిస్తున్నామని అన్నారు. వైరా అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధిపై డిప్యూటీ సీఎం ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి,1456 స్వయం సహాయక సంఘ సభ్యులకు 153 కోట్ల 60 లక్షల బ్యాంకు లింకేజ్ రుణాలు చెక్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డిసిసిబి డైరెక్టర్ బొర్రా రాజశేఖర్, డిఆర్డీవో సన్యాసయ్య, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకొబ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, డిసి హెచ్ఎస్ డా. రాజశేఖర్, డిఇఓ చైతన్య జైని, డిఐఇఓ రవిబాబు, వివిధ శాఖల అధికారులు, మహిళలు, ఏపీఎంలు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థలో మార్పు తేవాలన్నదే మా సంకల్పం




- కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో 'అగ్రగామి'గా తెలంగాణ
- యువతకు స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ – స్కిల్లింగ్ పై ఫోకస్
- జేఎన్టీయూహెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్' లో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మహా :** విద్యా వ్యవస్థలో సమూల మార్పు తేవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కూకట్ పల్లిలోని జేఎన్టీయూ హెచ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'జేఎన్టీయూహెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్ 2025'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను అగ్రగామిగా నిలిపేలా 'ఎకోసిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'ఏఐ'లో బెంచ్ మార్క్ ను సెట్ చేసేలా అంతర్జాతీయ నిపుణుల భాగస్వామ్యంతో త్వరలోనే 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్'ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మనం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరిచిపోవద్దని, సమాజానికి తిరిగి ఇవ్వడం కృతజ్ఞతతో కూడిన బాధ్యత అని అన్నారు. మనం మన విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ప్రశ్నించే అవకాశాన్ని పొందగలమన్నారు. జేఎన్టీయూహెచ్ లో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఫండింగ్, రీసెర్చ్ క్లస్టర్స్, ఇంటర్నేషనల్ మెంటార్ షిప్ నెట్ వర్క్స్, గ్లోబల్ అల్యూమ్ని కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని పూర్వ విద్యార్థులను కోరారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యువ ఇంజనీర్ల ఆలోచన విధానం మారాలని, ఉద్యోగార్థిగా కాకుండా పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని మార్గనిర్దేశం చేశారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా ప్రాక్టికల్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, జేఎన్టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర రావు, రెక్టార్ డా.కె.విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవ పంచాయతీలకు రూ. 10 లక్షలు

- బంపరాఫర్ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- పంచాయతీ ఎన్నికల వేళ కీలక నిర్ణయం

**మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ కు సమయం సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. డిసెంబర్ రెండో వారంలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఈ తరుణంలో పంచాయతీ ఎన్నికలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది ఒక రకంగా పంచాయతీలకు బంపరాఫర్ అనే చెప్పవచ్చు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలోని ప్రజలంతా కూర్చుని.. చర్చించుకొని ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకుంటే.. అలాంటి గ్రామ పంచాయతీలకి రూ. 10 లక్షల గ్రాంట్ ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఓట్ల సవరణకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం ఈనెల 23వ తేదీ వరకు ఓటర్ల జాబితాను గ్రామాల్లోనే సవరించాలని ఎలక్షన్ కమిషన్ నిర్ణయించుకుంది. పంచాయతీల రిజర్వేషన్ల జాబితాను కూడా ఈసీ విడుదల చేసింది. దీంతో గ్రామాల్లో మరోసారి వాతావరణం వేడెక్కింది. ఇప్పటికే ఆశావహులు ఎవరికి వారుగా గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. రాజకీయ పార్టీలు కూడా అందుకు అనుగుణంగా సన్నద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల చేసిన ప్రకటన గ్రామాభివృద్ధికి దోహపడేదిగా ఉండటంతో ఏకగ్రీవ ఎన్నిక కోసం గ్రామాలలో ప్రయత్నాలు ముమ్మరమయ్యే అవకాశాలున్నాయి. సర్పంచ్ పదవికి ఏకగ్రీవ ఎన్నిక జరిగితే ఏకంగా గ్రామానికి గ్రాంట్ కింద రూ. 10 లక్షలు విడుదలైతే గ్రామాన్ని ఆదర్శవంతమైనదిగా తీర్చిదిద్దుకోవచ్చన్న చర్చ గ్రామాలలో జోరందుకుంది.

# హోండా కార్స్ ఇండియా ఎలివేట్ ఏడీవీ ఎడిషన్ విడుదల

**హైదరాబాద్, మహా:** హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ భారతదేశంలో అత్యంత నాణ్యమైన మరియు విలాసవంతమైన కార్లను తయారు చేయడంలో అగ్రగామిగా ముందంజలో ఉంది. ఈ సంస్థ ఇవాళ హైదరాబాద్ నగరంలో తమ అపారమైన ప్రజాదరణ పొందిన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ అయిన హోండా ఎలివేట్ యొక్క ఉత్పత్తుల శ్రేణిలో ఒక కొత్త, ముఖ్యమైన అత్యున్నత స్థాయి శ్రేణి మోడల్‌ను పరిచయం చేసింది. ఆ నూతన మోడల్ పేరే ఎలివేట్ ఏడీవీ ఎడిషన్. ఈ ఆవిష్కరణ వాహన ప్రియులను విశేషంగా ఆకర్షించింది. ఎలివేట్ ఏడీవీ ఎడిషన్ ప్రారంభోత్సవం సందర్భంగా హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ యొక్క మార్కెటింగ్ మరియు సేల్స్ విభాగ వైస్ ప్రెసిడెంట్, కునాల్ బెహల్ మాట్లాడుతూ.. "హోండా ఎలివేట్ కారుకు దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారుల నుండి సానుకూలమైన మరియు గొప్ప స్పందన లభించింది. అపారంగా అభిమానించబడిన మా స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యూవీ) అయిన హోండా ఎలివేట్ యొక్క ఉత్పత్తుల శ్రేణిలో అత్యున్నత స్థాయి మోడల్‌గా ఎలివేట్ ఏడీవీని పరిచయం చేయడం ద్వారా, మేము మా వినియోగదారులకు వారి చురుకైన మరియు నిరంతరం మారుతున్న జీవనశైలికి సరిపోయేలా మరిన్ని ఎంపికలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము.






# పార్టీ బలోపేతంపై పవన్ నజర్

- సంస్థాగత నిర్మాణం, కమిటీల కూర్పుపై డిప్యూటీ సీఎం కసరత్తు
- కార్యకర్తల అభిప్రాయ సేకరణతో సంస్థాగత మార్పులు

**హైదరాబాద్, మహా:** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, వివిధ కమిటీల కూర్పుపై దృష్టి సారించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జనసేన విజయం సాధించి, ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, నియోజకవర్గ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఆయన ఉన్నత స్థాయి కసరత్తును ప్రారంభించారు. పార్టీ కమిటీల నిర్మాణం, వాటి కూర్పు పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండేలా చూసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తించారు. ఇందులో భాగంగా, జనసేన కార్యకర్తలు, నాయకులతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత.. నియోజకవర్గాలలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, జనంలో పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లడం, స్థానిక సమస్యలపై స్పందించడం వంటి అంశాలపై కార్యకర్తల మనోగతాన్ని ఆయన నమోదు చేసుకుంటున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, సమర్థత, నిబద్ధత కలిగిన కొత్త నాయకులను కమిటీల్లో భాగస్వామ్యం చేయడంపై ఉపముఖ్యమంత్రి ప్రధానంగా దృష్టి సారించారు. రాబోయే కాలంలో పార్టీని ప్రజా ఉద్యమాలకు సిద్ధం చేసే దిశగా ఈ సంస్థాగత మార్పులు ఉపయోగపడతాయని జనసేన వర్గాలు భావిస్తున్నాయి.






# ఓవర్ లోడ్‌పై ఉక్కుపాదం



- పర్మిట్లు రద్దు, డ్రైవింగ్ లైసెన్స్‌లు సీజ్
- మరణాల రేటు నివారణకు యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలి
- అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి, మరణాల రేటును నివారించే లక్ష్యంతో రవాణా శాఖ అమలు చేస్తున్న సంస్కరణలను మరింత కఠినతరం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ వేగవంతం చేయడానికి ఏర్పాటు చేసిన 33 జిల్లా స్థాయి బృందాలు, మూడు రాష్ట్ర స్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలను ఏ బృందం ఎక్కడ చేపడుతుందనే ముందస్తు సమాచారం లేకుండా, ప్రతిరోజు ఉదయం 6 గంటలకు సమాచారం అందించి ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను అమలు చేస్తున్నారు. గత 10 రోజుల వ్యవధిలో నిర్వహించిన తనిఖీల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 4,748 కేసులు నమోదు చేయగా, మొత్తం 3,420 వాహనాలను సీజ్ చేశారు.

ముఖ్యంగా ఓవర్ లోడ్ కారణంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో, దానిపై ఎక్కువగా దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఓవర్ లోడ్ అయిన వాహనాలు సీజ్ చేయడమే కాకుండా, రెండోసారి పట్టుబడితే ఆ వాహనం పర్మిట్ రద్దు చేయడంతో పాటు, డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్ లైసెన్స్‌ను కూడా రద్దు చేసేలా కఠిన చర్యలు తీసుకోనున్నారు. మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ, వాహనాల లోడింగ్ జరిగే ప్రాంతాలలోనే ఓవర్ లోడ్‌ను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రవాణా శాఖ కమీషనర్ ఇలంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్లు రమేష్, చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్యలు పాల్గొన్నారు.

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# మళ్లీ ఉప ఎన్నికల రాగాలు

తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ వేడి పెరుగుతోంది. సాదారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయమున్నా.. మళ్ళీ ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికల హడావుడి కనిపిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా, దానం నాగేందర్, కడియం శ్రీహరిల రాజీనామాలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఫార్ములాఈ రేసు విచారణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అధికార – ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు జరుగుతున్నాయి. కేటీఆర్ అరెస్ట్ జరగకపోవచ్చని, విచారణపేరుతో కాలయాపన తప్ప తేల్చే ఉద్దేశం సర్కారుకు లేదన్న మాటలు వినబడుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గందరగోళాలు, ఎత్తులు పై ఎత్తులు షాకింగ్ గా మారాయి. బీజేపీలోనూ అంతర్గత ప్రజాస్వామ్యం మైకుల సాక్షిగా ప్రవహిస్తుండగా, కవిత జనంబాటను వ్యూహాత్మకంగా కొనసాగిస్తున్నారు. తరచూ బీఆర్ఎస్ ను కౌంటర్లు, ఎన్ కౌంటర్లతో సవాల్ చేసిన వారికి పెనుసవాల్ గా మారారు. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ హైదరాబాద్ లో ప్రదర్శన, బెంగుళూరులో జగన్, కేటీఆర్ ల భేటీ రాజకీయ మార్పులకు సరికొత్త సంకేతంగా కనబడుతోంది.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ ఒకే రంగులో ఉండవు. అసలు రాజకీయం ఎపుడూ కదలిక లేకుండా ఉండదు. పరిస్థితులను బట్టి రూపం మార్చుకుంటుంది. కొన్నిసార్లు మబ్బుల్లా కమ్ముకుంటాయి...కొన్నిసార్లు పిడుగులు పుట్టిస్తాయి. ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కనిపిస్తున్న దృశ్యం —— *పిడుగు పడే ముందు వచ్చే ఆ నిశ్శబ్దం. రాష్ట్రంలో మళ్లీ **ఉప ఎన్నికల రాగాలు* వినిపిస్తున్నాయి. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నా, రాజకీయ వేదికపై బైపోల్స్ – లోకల్ పోలిటిక్స్ హడావుడి స్పష్టంగా కనబడుతోంది.

### ఫిరాయింపు ఎమ్మెల్యేల భవితవ్యం

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలు తప్పదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. దీంతో దానం నాగేందర్, కడియం శ్రీహరి రాజీనామాలపై చర్చలు వేగం అందుకున్నాయి. రాజకీయ వేదికపై ఒక చిన్న రాయి పడితే... అది ఎంత పెద్ద అలల్ని తెస్తుందో ఈ పరిణామాలు మళ్లీ నిరూపిస్తున్నాయి. తనకు మంత్రి పదవి కావాలని, రాజీనామాకు సిద్ధమని ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ హైకమాండ్ కు స్పష్టం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. న్యాయనిపుణుల విశ్లేషణ ప్రకారం దానం నాగేందర్ రాజీనామా అనివార్యం. సుప్రీంకోర్టే ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకున్న నేపథ్యంలో తప్పించుకునే అవకాశాలు కనబడడం లేదు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక దానం నాగేందర్ ఎంపీగా పోటీ చేయడం వల్ల అనివార్యం కాగా, కడియం శ్రీహరి పై కూడా చర్చ జరుగుతోంది. కడియం శ్రీహరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన తన కుమార్తె కడియం కావ్య అభ్యర్థిత్వాన్ని బలపరచడం వల్ల ఆయనపై చర్య తీసుకోవాలని బిఆర్ఎస్ ఆధారాలతో ఫిర్యాదుచేసింది. దీని నుండి ఎలా బయటపడతారన్నది చూడాల్సి ఉంది. త్వరలో తెలంగాణలో బైపోల్ ఖాయం. అది ఒకటా, రెండా అన్నది డిసెంబర్ లో స్పష్టత రానున్నది.

### ఫార్ములా-ఈ విచారణ-రాజకీయ వేడి

గవర్నర్ ఫార్ములా–ఈ రేసు విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే, అధికార–ప్రతిపక్షాల మధ్య మళ్లీ ఆరోపణల కార్చిచ్చు చెలరేగింది. ఎలక్ట్రిక్ కార్ల రేసు... ఇప్పుడు ఎలక్ట్రిక్ రాజకీయ రేస్ గా మారింది. ఎవరు వేగం పెంచుతారు? ఎవరు బ్రేక్ వేస్తారు? అని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. బీఆర్ఎస్ వర్గాల్లోనే కాదు... రాజకీయ వర్గాలంతా కేటీఆర్ అరెస్ట్ పై రకరకాలుగా చర్చిస్తున్నారు. తనను అరెస్ట్ చేసే ధైర్యం ఈ సర్కారుకు లేదని కేటీఆర్ అంటున్నారు.



> **ఖైరతాబాద్ ఉప ఎన్నిక దానం నాగేందర్ ఎంపీగా పోటీ చేయడం వల్ల అనివార్యం కాగా, కడియం శ్రీహరి పై కూడా చర్చ జరుగుతోంది. కడియం శ్రీహరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన తన కుమార్తె కడియం కావ్య అభ్యర్థిత్వాన్ని బలపరచడం వల్ల ఆయనపై చర్య తీసుకోవాలని బిఆర్ఎస్ ఆధారాలతో ఫిర్యాదుచేసింది. దీని నుండి ఎలా బయటపడతారన్నది చూడాల్సి ఉంది. త్వరలో తెలంగాణలో బైపోల్ ఖాయం. అది ఒకటా, రెండా అన్నది డిసెంబర్ లో స్పష్టత రానున్నది.**

> **అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ లో ఎత్తులు – పైఎత్తులు, లోపలి గందరగోళాలు ఉన్నాయి. పీసీసీ కమిటీ, తాజా డీసీసీల నియామకాల్లో ముఖ్యమంత్రి, కీలక నేతల మద్దతుదారులను, బలమైన నేతలను దాదాపుగా పక్కనబెట్టి.. హైకమాండ్ నేతలు పరికొత్త ప్రయోగాలకు పోతుండడంతో కనపడని తెరపై ఆందోళన వ్యక్తమవుతోంది.**

> **తెలంగాణ జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత జనంబాటకు ప్రజల్లో మంచి స్పందన కనపిస్తోంది. కవితకు యాత్రలు, జనం బాటలు, భారీ కార్యక్రమాలు కొత్త కాదు. వ్యూహాత్మకంగా కవిత కొనసాగిస్తున్న యాత్ర ప్రధానంగా బీఆర్ఎస్ ను చిక్కుల్లో పడేస్తున్నది. ప్రభుత్వంతో పాటు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన తప్పులను కూడా ఆమె ఎత్తిచూపుతున్నారు. కవిత యాత్ర బిఆర్ఎస్ కు సరికొత్త సవాల్ ను విసిరింది.**

అయితే అరెస్టు కన్నా విచారణ పేరుతో కాలయాపన చేస్తారన్న వాదన బలంగా వినిపిస్తోంది. రాజకీయాల్లో ప్రతిసారీ వచ్చే ఈ కథ... ఈసారి ఏ క్లైమాక్స్‌కు దారితీస్తుందో చూడాలి. అయితే రాజకీయ వర్గాల్లో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కుటుంబంలో ఎవరినీ అరెస్ట్ చేయదన్న బావనే ఎక్కువగా వినబడుతోంది.

### కాంగ్రెస్ అంతర్గత అలజడి

అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ లో ఎత్తులు – పైఎత్తులు, లోపలి గందరగోళాలు ఉన్నాయి. పీసీసీ కమిటీ, తాజా డీసీసీల నియామకాల్లో ముఖ్యమంత్రి, కీలక నేతల మద్దతుదారులను, బలమైన నేతలను దాదాపుగా పక్కనబెట్టి.. హైకమాండ్ నేతలు పరికొత్త ప్రయోగాలకు పోతుండడంతో కనపడని తెరపై ఆందోళన వ్యక్తమవుతోంది. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు పార్టీ శిబిరానికి కొత్త జోష్ తెచ్చింది. ఆ తీర్పు ఒక్కటే ఒక రాజకీయ సంకేతం ఇచ్చింది. ప్రభుత్వం పట్ల ప్రజా నమ్మకం ఇంకా నిలకడగానే ఉంది అని తేల్చిచెప్పింది. ముఖ్యమంత్రి రాజకీయ చాణక్యం ప్రస్ఫుటమైంది. అసాధ్యమనుకున్నదానిని రేవంత్ సుసాధ్యం చేయగలడన్న పేరుంది. ఈ ఉత్సాహ భరిత వాతావరణంలోనే ఖైరతాబాద్ బైపోల్‌కి 'సై సై' అంటూ కాంగ్రెస్ దూసుకెళ్ళింది. ఈ జోరు ఆధారంగా కాంగ్రెస్ ఇప్పుడు ఖైరతాబాద్ బైపోల్‌కు పూర్తి ఉత్సాహంతో సిద్ధమవుతోంది. ఖైరతాబాద్ బైపోల్ అనివార్యమైతే రాజకీయం మరింత రసవత్తరం కానుంది. బిఆర్ఎస్ కు ఇది పెద్దసవాల్ గా మారుతుంది.

ఇక బీజేపీ లో అంతర్గత చర్చలు, వర్గపోరాటాలు ప్రతిసారీ బహిరంగంగానే వెలుగులోకి వస్తున్నాయి. మైక్ ముందు మాట్లాడే ప్రతి నాయకుడు పార్టీ లోపలి వాతావరణాన్ని బహిర్గతం చేస్తూ ప్రజల ముందే పార్టీ భవిష్యత్తును ఆలోచింపజేస్తున్నారు. తెలంగాణ జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత జనంబాటకు ప్రజల్లో మంచి స్పందన కనపిస్తోంది. కవితకు యాత్రలు, జనం బాటలు, భారీ కార్యక్రమాలు కొత్త కాదు. వ్యూహాత్మకంగా కవిత కొనసాగిస్తున్న యాత్ర ప్రధానంగా బీఆర్ఎస్ ను చిక్కుల్లో పడేస్తున్నది. ప్రభుత్వంతో పాటు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన తప్పులను కూడా ఆమె ఎత్తిచూపుతున్నారు. హరీష్ రావు, సంతోష్ రావు, నవీన్ రావు, గంగుల కమలాకర్ వంటి నేతలతో పాటు తాజాగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అనుచరులు భూకబ్జాలు చేస్తున్నారని, చెరువులు మింగుతున్నారని అంటూ మండిపడ్డారు. కవిత యాత్ర బిఆర్ఎస్ కు సరికొత్త సవాల్ ను విసిరింది.

### జగన్ యాక్టివ్..
### తెలంగాణలో కొత్త సమీకరణాలు

జగన్——కేటీఆర్ భేటీ... తెలుగురాష్ట్రాల్లో కొత్త ధోరణికి కారణమవుతోంది. భవిష్యత్తు రాజకీయ మార్పులకు సంకేతంగా కనబడుతోంది. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ హైదరాబాద్‌లో కోర్టుకు హాజరైన సందర్భంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. అభిమానులు పోటెత్తారు. తరువాత శనివారం బెంగళూరులో జగన్ – కేటీఆర్ కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొని ఒకే వేదిక పంచుకోవడం ఆసక్తిగా మారింది. రెండు రాష్ట్రాల రాజకీయ పటంలో కొత్త గీతలు వేస్తున్నాయి. ఇది కేవలం ఒక మీటింగ్ కాదు —— రాబోయే రోజుల్లో ఏర్పడే కొత్త సమీకరణాలకు ఒక సంకేతంగా కనబడుతోంది. డిసెంబర్ లో తెలంగాణ రాజకీయాల్లో అనేక మార్పులు, సరికొత్త సమీకరణాలు కనబడుతున్నాయి. ముందుముందు వేడెక్కే రాజకీయ సంచలనాలు కళ్ళముందు కనబడుతున్నాయి. తెలంగాణ, ఏపీ పాలిటిక్స్ ను ఇవి ఏ మలుపులు తిప్పుతాయో చూడాలి.

> గవర్నర్ ఫార్ములా–ఈ రేసు విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే, అధికార–ప్రతిపక్షాల మధ్య మళ్లీ ఆరోపణల కార్చిచ్చు చెలరేగింది. ఎలక్ట్రిక్ కార్ల రేసు... ఇప్పుడు ఎలక్ట్రిక్ రాజకీయ రేస్ గా మారింది. ఎవరు వేగం పెంచుతారు? ఎవరు బ్రేక్ వేస్తారు? అని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

> జగన్——కేటీఆర్ భేటీ... తెలుగురాష్ట్రాల్లో కొత్త ధోరణికి కారణమవుతోంది. భవిష్యత్తు రాజకీయ మార్పులకు సంకేతంగా కనబడుతోంది. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ హైదరాబాద్‌లో కోర్టుకు హాజరైన సందర్భంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. అభిమానులు పోటెత్తారు. తరువాత శనివారం బెంగళూరులో జగన్ – కేటీఆర్ కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొని ఒకే వేదిక పంచుకోవడం భవిష్యత్ రాజకీయ వ్యూహాలకు సంకేతంగా కనబడుతోంది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999







## సమూహ యువజన సాహిత్యోత్సవం
# అపూర్వ స్పందన

**మహా:** సమూహ యువజన సాహిత్యోత్సవానికి పెద్ద సంఖ్యలో కవులు, రచయితలు, కళాకారులు హాజరయ్యారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ యువజన సాహిత్య ఉత్సవం రోజంతా నిర్వహించారు. ఈ యువజన సాహిత్య ఉత్సవం ఒక రోజు కార్యక్రమంగా ముగిసిపోకూడదు. అది యువతలో రేకెత్తించే ఆలోచనలు, భవిష్యత్తులో ఒక బలమైన సాంస్కృతిక ఉద్యమంగా మారాలి. ప్రశ్నించే తత్వాన్ని, నిలదీసే ధైర్యాన్ని, అన్నింటికీ మించి తోటి మనిషిని ప్రేమించే గుణాన్ని ఈ ఉత్సవం యువతకు అందిస్తుందని ఉత్సవానికి హాజరైన వారు ఆకాంక్షించారు. కోఠీలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం లో దీనిని నిర్వహించారు. ఆసక్తికరంగా, ప్రయోగాత్మకంగా ఈ కల్చరల్ ఫెస్టివల్ సాగింది.





## బస్ స్టాప్ వెనుక ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలి

### ధర్నా నిర్వహించిన విద్యార్థులు



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో స్కూళ్లో, ఆస్పత్రులు, ప్రార్థన మందిరాలు, బస్టాప్ లలో ముందు వెనుక ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని శనివారం పలు కళాశాల విద్యార్థులు, పలు సంఘాల నాయకులు, సంఘసంస్కర్త సిద్ది రెడ్డితో కలిసి ఎయిర్పోర్ట్ ప్రధాన రహదారిలో ధర్నా నిర్వహించారు. ధర్నా నిర్వహించడంతో కిలోమీటర్ పొడవున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు విద్యార్థులను ధర్నా నుంచి కళాశాలకు పంపించారు. ఎయిర్పోర్ట్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులను సంఘసంస్కర్త సిద్దిరెడ్డి పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## బండ్లగూడ మున్సిపల్ జాగీర్ కార్పొరేషన్ లో పలు అభివృద్ధి పనులు మరియు సమస్యలపై సమీక్ష సమావేశం




**గండిపేట, మహా:** గండిపేట మండలంలోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ లో శనివారం మధ్యాహ్నం కమిషనర్ బి. శరత్ చంద్ర ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ లోని పలు శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ లో జరపవలసిన అభివృద్ధి పనులు మరియు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి మరియు త్రాగునీటి వనరులు, వార్డుల వారీగా కార్యాచరణమరియు ప్రణాళిక, వివిధ వార్డులలో పారిశుద్ధ పనుల నిర్వహణ,ఫ్రైడే ఫ్రైడే, ట్రేడ్ లైసెన్సులు, జననం మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ మిషనరీ కొనుగోలు, నూతన ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం ,LRS భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సి సర్టిఫికెట్ల విడుదల, అక్రమ నిర్మాణాలపై చర్యలు, అడ్వర్టైజ్మెంట్ పన్నుల వసూలు,కోర్టు కేసులు ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన, షెల్టర్ ఫర్ హోమ్ లెస్ సర్వే, నూతన సంఘాల ఏర్పాటు, వివిధ లక్ష్యాల సాధన, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్, అండ్ _ అసెండ్ మరియు అండర్ అసెండ్ పన్ను విధింపు, భువన్ జియో టాకింగ్, ఐ జి ఆర్ ఎస్ రెగ్యులర్, ఇంజనీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులను చేపట్టుట,వీధి దీపాల నిర్వహణ వాటి మరమ్మతులు, వన మహోత్సవం నందు టార్గెట్ ప్రకారం పార్కులు, ఓపెన్ స్పేస్ ప్రభుత్వ సంస్థలలో మొక్కలు నాటుట, మరియు వాటి సంరక్షణ, అకౌంట్స్ విభాగము నుండి చెల్లింపులు, బ్యాలెన్స్ వివరాలు, ఆడిత అభ్యంతరాలు, సమాచార హక్కు చట్టం 2005 పెండింగ్లో ఉన్న ధరాకస్తులు వివరాలు, ప్రభుత్వ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు మరియు వారి సర్వీస్ లు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డి చంద్రశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు డిఇఓ లు డబ్ల్యూఐలు బీసీలు ఆర్పీలు మరియు శానిటరీ జవాన్ లు పాల్గొన్నారు.

## నూతన సీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించిన కార్పొరేటర్ తోకల



**రాజేంద్రనగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు లక్ష్మీగూడా మల్లన్న దేవాలయ పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులలో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులు, టీఎన్జీవోస్ కాలనీ 60 ఫీట్ల రోడ్డు పనులను రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు, బస్తీ వాసులతో కలిసి పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఎక్కడ కూడా నాణ్యత లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్ణీత సమయంలో పనులను త్వరితగతిన పూర్తి చేసి డివిజన్ ప్రజలకు అందుబాటులోనికి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్,బిజెపి నాయకులు అడికె జనార్దన్, అడికె, మారయ్య, ప్రవీణ్ కుమార్, అడికె మల్లేష్, బుచ్చి రెడ్డి,టి,చిన్న, శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి, అశోక్, రాజ్ కుమార్, కృష్ణ, అడికె శివ, కిట్టు, ప్రభాకర్, పద్మ, శివ, భార్గవ్, పంతులు, శ్రీనివాస్, సందీప్ అనిల్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని కారు డ్రైవర్ మృతి



**రాజేంద్రనగర్, మహా ;** గుర్తు తెలియని లారీ ఢీకొని కారు డ్రైవర్ మృతి చెందిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద గోల్కొండ అవుటర్ రింగ్ రోడ్డుపై శనివారం జరిగింది. స్టేషన్ సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాలు, మెదక్ జిల్లా గ్రామం బ్రాహ్మణ కాలనీకి చెందిన కామిని భరత్ ( 26) వృత్తిరీత్యా డ్రైవర్. ఇతడు అదే గ్రామానికి చెందిన వేముల శేఖర్ కుటుంబాన్ని తీసుకొని ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా కొల్లాపూర్ లో ఉన్న నర్సింహ స్వామి దేవాలయ దర్శనానికి వెళ్తున్నారు. ఉదయం 8,10 గంటల సమయంలో పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు పై కారులో వేముల కుటుంబ సభ్యులతోవెళ్తుండగా లారీ వేగంగా వచ్చి కుడి వైపు ఢీ కొడుతూ వెళ్ళింది. ప్రమాదం కారణంగా కారును పక్కకు ఆపి డ్రైవర్ భరత్,వేముల శేఖర్ తోపాటు అతని కూతురు కిందికి దిగారు. శేఖర్ భార్య మాత్రం ఆరోగ్యం బాగాలేక కారులోనే ఉన్నది. కారు డ్యామేజ్ కావడంతో, వేరే కారు బుక్ చేసుకొని వెళ్లాలని నిర్ణయించుకున్నారు. 25 నిమిషాల తర్వాత కారును డ్రైవర్ భరత్ , శేఖర్ పరిశీలిస్తుండగా 8,35కు గుర్తుతెలియని లారీ వేగంగా వచ్చి కారు డ్రైవర్ ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వేముల శేఖర్ కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతుని తమ్ముడు కామిని సాయి సచిన్ ఇచ్చిన ఫిర్యాదు తో పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

## అందుబాటులోకి మొబైల్ ఫోరెన్సిక్ వాహనం

### ప్రారంభించిన వరంగల్ పోలీస్ కమిషనర్



**హన్మకొండ మహా;** నేరానికి సంబంధించి సంఘటనా స్థలంలో నిందితులను గుర్తించడంతో పాటు సాక్ష్యాధారాలను సేకరించే ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ రెండవ వాహనాన్ని అందజేసారు. ఈ వాహనాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్బంగా వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అత్యాధునిక పరికరాలతో రూపొందించబడిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని వరంగల్ కమిషనరేట్ పోలీసులకు మరింత మెరుగైన సేవలందించనున్నది. ఇక పై ఎదైనా నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకోని సంఘటన జరిగిన స్థలం నుండి రక్తపు మరకలు, వేలిముద్రల తో పాటు ఇతర సాక్ష్యాధారాలను సేకరించి ఈ మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన అధునిక పరికరాలతో పరీక్షలను నిర్వహించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ మొబైల్ వాహనం లో విధులు నిర్వహించేందుకు ఆరుగురు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణను అందజేయడం జరిగిందని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమం డిసిపి అంకిత్ కుమార్, గుణ శేఖర్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్, శ్రీనివాస్ తో పాటు ఏసీపీ లు, ఆర్. ఐ లు, ఫింగర్ ప్రింట్ ఇన్స్ స్పెక్టర్లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా దార కవిత



**వరంగల్ మహా;** హైదరాబాద్ సిటీ పోలీస్ సైబర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న దార కవితను, వరంగల్ సెంట్రల్ జోన్ నూతన డిసిపి గా నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఇటీవల సంచలనం సృష్టించిన ఐ బొమ్మ రవి కేసును దర్యాప్తు చేస్తున్న కవిత కేసు దర్యాప్తు చేపట్టి విచారణలో ఉండగా ఆమె ను బదిలీ చేయడం గమనార్హం.

## జిల్లాలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం

### వర్చువల్ గా ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ మహా;** శనివారం హనుమకొండలోని డిసిసి బ్యాంక్ ఆడిటోరియంలో శనివారం వరంగల్ జిల్లాకు సంబంధించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం చేపట్టిన "మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఈ పంపిణీ జరిగింది. హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొనగా, హన్మకొండ డిసిసిబి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆప్కాబ్ చైర్మన్ మర్నేని రవీందర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డిలు మహిళ సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన అద్భుతమైన రంగుతో చీరలు తయారు చేయించినందుకు మంత్రులు సితక్క, తుమ్మల నాగేశ్వరరావు లకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ స్వయం సహాయక కార్యక్రమాలు మహిళలను మరింత శక్తివంతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సంకల్ప దిశగా సాగుతున్నదని స్పష్టం చేశారు. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారీ పెట్టి గౌరవించాలని ఉద్దేశంతో కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీచేస్తున్నామన్నారు. మొదటి విడతలో గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు, పంపిణీ చేస్తున్నట్లు వచ్చే మార్చి నెలలో రెండవ విడతలో పట్టణ ప్రాంతం మున్సిపాలిటీలోని 35 లక్షల మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తామన్నారు. మహిళా సంఘాల్లో సభ్యత్వం లేని మహిళలను సంఘాల్లో చేర్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు 18 ఏళ్లు నిండిన దారిద్యరేఖకు దిగువనన్న ప్రతి మహిళకు చీర అందించాలని మంత్రి కోరారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా పంపిణీకు ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను సూచించారు. అనంతరం.. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని షెడ్యూల్ ఖరారు చేసి, ప్రతీ ఇంటికీ వెళ్లి బొట్టు పెట్టి చీర సారె అందించడం జరుగుతుందని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నియోజక వర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, పారదర్శకంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1,24,416 మంది సభ్యులు ఉన్నారని, మరో కొత్తగా 42 వేల మంది సభ్యులను చేర్పించడం జరుగుతుందని, వారికి కూడా చీరల పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ చీరల స్వర్గం అనేది ఎక్కడున్న నేలపైకి దించుదాం అనే ప్రార్థన గీతాన్ని పోలిన విధంగా ఈ చీరలను తయారు చేయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో రామిరెడ్డి, డిఆర్డీఓ, సెర్ప్ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఉనికిచెర్ల 4 లెన్స్ బీటీ రోడ్డు వెడల్పుకు శంకుస్థాపన

**హన్మకొండ మహా;** కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) నిధులతో రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో యూని సిటీ మాస్టర్ ప్లాన్ రోడ్ 4 లెన్స్ బీటీ రోడ్డుగా ఉనికి చెర్ల వరకు వెడల్పు చేయడంతో పాటు, కుడా నిధులు రూ.8 కోట్ల వ్యయం తో యూని సిటీ లే ఔట్ లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వరంగల్ లోక్ సభ సభ్యురాలు కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కుడా వైస్ ఛైర్మన్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లు సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ రాధిక రెడ్డి కుడా సి పి ఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## వర్ధన్నపేటలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం

### పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో శనివారం వర్ధన్నపేట మండల పరిధిలోని గ్రామాల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. మొదటగా స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో కలిసి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన వారిలో టెక్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శృతి, తహశీల్దార్ విజయ్,మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి పైపులైన్ లీకేజీలు అరికట్టాలి

### డివిజన్లో అభివృద్ధి పనులు పర్యవేక్షించిన కార్పొరేటర్



**వరంగల్ మహా;** వరంగల్ నగరం 22 వ డివిజన్ ఎల్బీనగర్ వీధిలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి శనివారం పర్యవేక్షించారు. అనంతరం నర్సంపేట రోడ్డు ఎస్ ఆర్ కళాశాల వద్ద జరుగుతున్న మంచినీటి పైప్లైన్ మరమ్మత్తు పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి పర్యవేక్షించారు.



## డివిజన్లలో శానిటేషన్ సక్రమంగా జరగాలి

### నగర మేయర్ గుండు సుధారాణి

**వరంగల్ మహా;** బల్దియా పరిధిలోని 24, 25, 28 డివిజన్ల పరిధిలో శానిటేషన్ సక్రమంగా జరగాలని అలాగే ప్రతి కాలనీల లోని చివరి ఇంటి వరకు చెత్త సేకరణ, పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పోతన నగర్ లోగల సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ లో క్షేత్ర స్థాయిలో శానిటేషన్ తనిఖీలు చేపట్టి గృహాల నుండి సేకరిస్తున్న చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి తడి పొడి చెత్తను వేరుగా అందించాలని స్థానికులకు సూచించి చెత్త తరలింపు ప్రక్రియను అధికారులతో కలిసి మేయర్ స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ తేజస్వి శిరీష్, సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్, గోల్కొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ మాకు న్యాయం చేయండి



**వలిగొండ, మహా:** వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామంలోసర్వేనెంబర్ 708,బై ఆ వన్ లో ప్రభుత్వ భూమి అసైన్మెంట్ మా పేరుమీద పట్టాగ లిగి ఉన్నాము కానీ మా భూమిని గత కొన్ని సంవత్సరాల మా గ్రామానికి చెందిన చిట్టెడి నరసింహారెడ్డి కబ్జా చేసి మమ్ములను భూమి మీదికి రాకుండా బెదిరిస్తున్నాడని మాకు న్యాయం చేయాలని శనివారం తాసిల్దార్ దశరథకు చిట్టేడి సుమలత ప్రతాపరెడ్డి భోగారం మంజుల కిష్టయ్య వినతి పత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు



## ట్రేడ్ వసూళ్లపై దృష్టి సారించండి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- సానిటరీ ఇన్స్పెక్టర్ లతో ట్రేడ్ వసూళ్ల పై సమీక్ష

**వరంగల్ మహా;** సానిటరీ ఇన్స్పెక్టర్ లు ట్రేడ్ వసూళ్ల పై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కమిషనర్ ఛాంబర్ లో ట్రేడ్ వసూళ్ల పురోగతిపై సానిటరీ ఇన్స్పెక్టర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్ధవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత నెల రోజుల నుండి ట్రేడ్ వసూళ్ల లో పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సానిటరీ ఇన్స్పెక్టర్లు వారికి కేటాయించిన డివిజన్ల వారిగా శానిటేషన్ కార్యకలాపాలతో పాటు సమానంగా ట్రేడ్ వసూళ్ల జరిపే బాధ్యత ఎస్ ఐ ల పై ఉందని కమిషనర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఎం హెచ్ఓ డా.రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్, గోల్కొండ శ్రీను, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మాణం చేయాలని రెండవ రోజు బిజెపి దీక్ష



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని గేట్ వద్ద బిజెపి పార్టీ ఆధ్వర్యం లో నేడు రెండవ రోజు నిరాహారదీక్ష కొనసాగుతుంది... ఈ దీక్షలో బిజెపి మండల అధ్యక్షులు పూజారి కుమార స్వామి,పలు గ్రామాల ప్రజలు, నాయకులు మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పత్రికల రిజిస్ట్రేషన్ జిల్లా అధికారులకే అధికారం

**వరంగల్ మహా;** సాధారణ పరిపాలన (సమాచార, ప్రజా సంబంధాల) శాఖ 'ప్రెస్ సేవ' పోర్టల్ ద్వారా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పత్రికా, పత్రికల రిజిస్ట్రేషన్ చట్టం 2023' కింద నిర్దేశిత అధికారులుగా జిల్లా కలెక్టర్లు, జిల్లా మేజిస్ట్రేట్ లను నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక పై కొత్త పత్రికల నమోదు, అనుమతి ప్రక్రియలకు సంబంధించి జిల్లా స్థాయిలో ఈ అధికారులే బాధ్యత వహిస్తారని తద్వారా పత్రికల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా, సులభంగా మారుతుందని తెలుస్తోంది.

## కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**భువనగిరి, మహా :** రామన్నపేట మండల కేంద్రంలోని జెపి గార్డెన్ లో శనివారం నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు కొద్దిగా ఆలస్యమైన తెలంగాణ ఆడబిడ్డలకు మంచి నాణ్యమైన చీరలు పంపిణీ చేయడం జరిగిందన్నారు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు గత పాలనలో ప్రాజెక్టులపైనే కాకుండా చీరలపై కూడా దోపిడీ చేసి ఎనిమిది లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు ఉచిత బస్సు 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ కాకుండా మహిళలకు వడ్డీ ఇస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలి

### వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హన్మకొండ మహా;** మహిళలు విభిన్న రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్ లో ధర్మసాగర్, వేలేరు మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యంగా బాగుండాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు పెట్రోల్ బంకులు, దాదాపు 150 బస్సులను మహిళలకు కేటాయించించని తెలిపారు. అదేవిధంగా సోలార్ పవర్ ప్లాంట్ లు కూడా మహిళలకు ప్రభుత్వం ఇస్తుందన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, కుట్టు కేంద్రాల మహిళలకు ఉపాధి అవకాశాలలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మహిళలను భాగస్వామ్యం చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్రం ప్రగతి సాధిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరలు చాలా బాగున్నాయని, తనకు ఒక చీరను అందిస్తే మరొక ప్రోగ్రాం కు ధరించి వస్తానని అన్నారు. ఆకాశం రంగును ప్రతి బింబించే విధంగా చీరలను నీలం రంగుతో ఎంతో ప్రణాళికతో తయారు చేయించారని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందన్నారు. మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి చీర చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం.. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అన్ని రంగాలలో ముందుండాలనే ఉద్దేశంతో సోలార్ పవర్ ప్లాంట్ లు, ఆర్టీసీ బస్సుల కేటాయింపు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ లో భాగస్వామ్యం చేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించి రాష్ట్ర ప్రగతికి తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా సమైక్య ఆధ్వర్యంలో జిల్లాలోనే ధర్మసాగర్ లో సెరికల్చర్ యూనిట్ ను త్వరలోనే ప్రారంభించు కోబోతున్నామని దీనిని మహిళలే నిర్వహణ చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్మసాగర్, వేలేరు మండలాలకు సంబంధించిన మహిళా సంఘాల ప్రతినిధులకు ఇందిరమ్మ చీరలను ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, తహసిల్దార్లు సదానందం, కోమి, ఎంపీడీవోలు అనిల్ కుమార్, లక్ష్మీ ప్రసన్న, ఇతర అధికారులతో పాటు ధర్మసాగర్ వేలేరు మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కన్న తల్లినే కొట్టి చంపిన కొడుకు

### పరారైన నిందితుడు, కేసు నమోదు చేసిన పోలీసులు

**వరంగల్ మహా;** వరంగల్ నగరం కాశిబుగ్గలోని ఓసిటి రోడ్డు రాముల వారి వీధిలో నివాసం ఉంటున్న కూరపాటి వెంకటమ్మ, భర్త పేరు నరహరి (లేట్), వయస్సు: 65 సంవత్సరాలు, కులం: పద్మశాలి ఈమె కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు కాగా, అందరికీ వివాహాలు అయి ఎవరికి వారు కుటుంబాలతో జీవిస్తూ ఉన్నారు. పెద్ద కొడుకు రాజు వయసు 48 సంవత్సరాలు వృత్తి ఆటో డ్రైవర్ మద్యానికి బానిస కావడంతో గత 15 సంవత్సరాల క్రితం అతడి భార్య అతడిని వదిలి పిల్లలతో సహా వెళ్లి నెక్కొండ మండలం రెడ్లవాడలో తన తల్లి ఇంటి వద్ద నివాసం ఉంటుంది. మద్యానికి బానిస అయిన సదరు రాజు ఆటో నడపగా వచ్చే డబ్బులతో నిత్యం మద్యం సేవిస్తూ వృద్ధాప్యంలో ఉన్న తన తల్లిని అకారణంగా మద్యం మత్తులో కొట్టేవాడు. ఈ క్రమంలో రాత్రి అనగా తేదీ 21.11. 2025 మద్యం మత్తులో ఇంటికి వచ్చి తన తల్లిని ఇష్టం వచ్చినట్లు కొట్టగా, ఆమె అపస్మారక స్థితిలో తన ఇంటి ఆవరణంలో పడిపోవడంతో నిందితుడు రాజు తప్పించుకొని పారిపోయాడు. తేదీ 22 11 2025 న మృతురాలి ఇంటి ప్రక్కన ఉండేవారు మృతురాలు అపస్మాకస్థితిలో ఉండడం గమనించి ఆమె చిన్న కొడుకు కూరపాటి కుమారస్వామికి సమాచారం అందించగా, కాశిబుగ్గలో నివాసం ఉంటున్న సదరు కుమారస్వామి వచ్చి తన తల్లిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నంలో 108 కి ఫోన్ చేసి పిలిపించగా, 108 సిబ్బంది వచ్చి మృతురాలు చనిపోయినట్లుగా నిర్ధారించారు. ఈ విషయంలో మృతురాలు చిన్న కొడుకు కుమారస్వామి ఇచ్చిన దరఖాస్తు మేరకు ఇంతేజార్గంజ్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందని ఇన్స్పెక్టర్ ఎంఏ షుకూర్ తెలిపారు.

# జిల్లాలో శిక్షణ అధికారుల పర్యటన



**ఆదిలాబాద్ మహా:** ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కు చెందిన ఐఏఎస్, ఐపిఎస్, ఐఆర్ఎంఎస్, ఐపీఓఎస్, ఐడిఏఎస్, ఐఈఎస్ అధికారులు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. 14 మంది శిక్షణ అధికారులకు స్వాగతం పలికి వారిని పరిచయం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బేల మండలంలోని అవాల్ పూర్, తలమడుగు మండలంలోని దేవాపూర్, సోనాల మండల కేంద్రంలో మూడు బృందాలుగా విడిపోయి పర్యటన నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఒక వార్డులో కూడా క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, పారిశుధ్యం, వ్యవసాయం, జీవనోపాధి తదితర అంశాలపై శిక్షణ అధికారులు అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా గురించి వివరిస్తూ, జిల్లాలో వివిధ మతాలు, కులాల ప్రజలు సామరస్యంగా నివసిస్తున్నారని అన్నారు. అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధ్యయనం చేసి, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వాటి నిర్వహణపై పరిశీలన చేయవచ్చని సూచించారు. క్షేత్ర పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, పర్యటన ముగింపులో తాము చేసిన అధ్యయన ఫలితాలపై సూచనలు ఇవ్వాలని శిక్షణ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్, డీపీఓ శ్రీధర్, డీఎంహెచ్ఓ నరేందర్, పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజ్, రీజనల్ ట్రైనింగ్ మేనేజర్ ప్రభాకర్ స్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం

## 50 పడకల నూతన ఆసుపత్రి భూమి పూజలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో హెచ్ఎండిఏ నిధులు ఐదు కోట్లతో నూతన 50 పడకల ఆసుపత్రికి మాజీ చైర్మన్ సుకూర్ శ్రీకాంత్ యాదవ్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సుస్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాస్పిటల్ భవన నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఐజిఆర్ఎస్ నిధులతో ఎయిర్పోర్ట్ కాలనీ నుండి కోత్వాల్ గూడ వరకు వేయనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హెచ్ఎండిఏ నిధులు 5 కోట్లతో నిర్మాణం చేపడుతున్న 50 పడకల హాస్పిటల్ నూతన భవనం పూర్తయితే, శంషాబాద్ చుట్టుపక్కల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. ప్రజల ఆరోగ్యం మా ప్రభుత్వానికి అత్యంత ప్రధానం. ఈ హాస్పిటల్ నిర్మాణం పూర్తయితే, చిన్న చిన్న వైద్య అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ప్రజలకు తప్పుతుందన్నారు. ఐజిఆర్ఎస్ రూ. 1.95 లక్షల నిధులతో నిర్మించనున్న ఎయిర్పోర్ట్ కాలనీ కోత్వాల్ గూడ బీటీ రోడ్డు ప్రజల రాకపోకలను సులభతరం చేస్తుందని, ప్రాంతాల మధ్య అనుసంధానతను పెంచుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు కాలనీ వాసులు సత్యనారాయణయాదవ్, యూసుఫ్, చంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, హరిఫ్ బాయి, సామిల్, ముకూర్ అరుణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# డిసెంబర్ 8, 9వ తేదీలలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్

## జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** డిసెంబర్ 8, 9వ తేదీలలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్కు సంబంధించి, ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం మైల్వంట తండాలో డిసెంబర్ 8, 9వ తేదీలలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను, హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావ్వకుండా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులని బాధ్యతగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కెవీపీ రాజు, కందుకూర్ తహశీల్దార్ గోపాల్, గ్రీన్ ఫార్మా సిటి సత్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మణికొండ మున్సిపాలిటీ సర్వేనెంబర్ 42లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన వ్యాపార కేంద్రాలను తొలగించండి



**గండిపేట, మహా:** గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీలోని సర్వేనెంబర్ 42 లో గల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేయటంతో ఆ ప్రాంతంలో వాహనదారులు తమ వాహనాలను ఇష్టానుసారంగా ఇక్కడ పడితే అక్కడ రోడ్లపై నిలిపివేయటంతో ఉదయం మరియు సాయంత్రం వేళ పంచవటి కాలనీ మరియు దర్గా ప్రధాన రోడ్డు ప్రాంతంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యపై తగిన చర్యలు తీసుకుని అక్రమంగా వెలిసిన వ్యాపార కేంద్రాలను తీసివేసి ట్రాఫిక్ సమస్యల కష్టాల బారి నుండి ప్రజలను కాపాడాలని ఈ సందర్భంగా కోరారు.

# కలెక్టర్‌కు జర్నలిస్టుల సత్కారం



**ఆదిలాబాద్ మహా :** జిల్లాకు జాతీయ అవార్డుల పంట పండిస్తున్న కలెక్టర్ రాజర్షిషాను ఆదిలాబాద్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ సభ్యులు కలెక్టర్ ఛాంబర్ లో ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అన్నోజుల శ్రీనివాస్ నేతృత్వంలో కలెక్టర్ కు జ్ఞాపికను అందజేశారు. మారుమూల జిల్లా ఆదిలాబాద్ కు దేశవ్యాప్త గుర్తింపు తీసుకురావడంలో ఎంతో కృషిచేస్తున్నారని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అందరి కృషితో ఆదిలాబాద్ ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని, అందులో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల కృషి కూడా ఎంతో ఉందని కలెక్టర్ అన్నారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్ తో చర్చించారు . జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పై సానుకూలంగా స్పందిస్తూనే ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇక ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ గా సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నానని, రానున్న రోజుల్లో అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకెళ్తామన్నారు. కలెక్టర్ ను కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్ట్ లు ప్రేమ్ సాగర్, సత్యనారాయణ, మొయిజ్, అనీల్ లతో పాటు కెమెరామెన్లు దత్తు, శ్రీనివాస్, రోహిత్, చంద్రశేఖర్, దీపక్, భూమేష్, నర్సింగ్, మహేష్,మహేందర్, తదితరులున్నారు.



## గ్రామానికి సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు

# సాగుతున్న యువ నాయకుడు షాపురం రాజు

**మొయినాబాద్ మహా:** రెడ్డిపల్లి గ్రామ పరిధి ప్రారంభం నుంచి వీరన్నపేట్, చిన్నమంగళరం శివారు వరకు వెలుగునున్న వీధి దీపాలు మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువ నాయకులు షాపురం రాజు (మాణిక్యం) గ్రామానికి సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. రెడ్డిపల్లి గ్రామ పరిధి ప్రారంభం నుంచి శివారు వరకు గ్రామంలోని ప్రతి వీధిలో లైట్లు సరిగా పనిచేయకపోవడంతో రహదారిపై ప్రయాణికులు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్రామపంచాయతీ పాలకవర్గం లేకపోవడం నిధుల కొరతతో అధికారులు స్పందించకపోవడంతో ఈ సమస్యను గమనించిన రెడ్డిపల్లి గ్రామ యువ నాయకులు షాపూరం రాజు (మాణిక్యం) గ్రామ ప్రజల ఆకాంక్ష మేరకు శనివారం షాపురం రాజు గ్రామస్తులతో కలిసి గ్రామంలోని అన్ని వీధిలలో తన సొంత డబ్బులతో సోలార్, విద్యుత్ వీధి దీపాలను అమర్చారు. ఈ సందర్భంగా షాపూరం రాజు మాట్లాడుతూ.. గ్రామ పరిధి ప్రారంభం నుంచి శివారు వరకు వీధి దీపాలు లేకపోవడంతో ప్రయాణికులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, గ్రామంలోని ప్రతి వీధిలలో లైట్లు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తన సొంత డబ్బులతో గ్రామంలోని వీధిలతో పాటు అన్ని దేవాలయాల వద్ద సోలార్ విద్యుత్ వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.గ్రామానికి ఎంత చేసిన తక్కువేనని గ్రామానికి సేవ చేసే అదృష్టం దక్కడంతో ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని షాపూరం రాజును అభినందించారు.





# ఆరాంఘర్ ఎక్స్ రోడ్‌లో ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగింపు

**రాజేంద్రనగర్, మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని అరాంఘర్ చౌరస్తా ప్రధాన రహదారిలో ఫుట్ పాత్ లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఫుట్ పాత్ ఆక్రమణతో ట్రాఫిక్ కి అంతరాయం ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే అరాంఘర్ చౌరస్తాలో వేళల్లో ప్రయాణికులు అరంఘర్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళుతూ ఉంటారు. అరాంఘర్ చౌరస్తా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉండడంతో పలువురు ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులు ట్రాఫిక్ రద్దీ కారణాలతో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ఆదేశాలతో జిహెచ్ఎంసి అధికారులు ఆరంఘర్ చౌరస్తా నుంచి పరివార్ దాబా వరకు ఫుట్ పాత్ ఆక్రమించి వెలిసిన నిర్మాణాలు, చిరు వ్యాపారుల డబ్బాలను జెసిబి సాయంతో శనివారం పూర్తిగా తొలగించారు. అరంఘర్ చౌరస్తా నుంచి పరివార్ దాబా వరకు ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించారు. తొలగించిన ఆక్రమణలు మరోసారి నిర్మాణాలు తల పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిహెచ్ఎంసి అధికారులు హెచ్చరించారు.

# అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పి. మౌనిక



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా అదనపు ఎస్పీగా ( పరిపాలన ) పి. మౌనిక బాధ్యతలు స్వీకరించారు, ఇటీవల జరిగిన ఐపీఎస్ ల బదిలీలలో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ ఏసీపీగా విధులు నిర్వహించిన ఆమె ఆదిలాబాద్ కు బదిలీ పై వచ్చారు. శనివారం పోలీసు ముఖ్య కార్యాలయం లో ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. పరిపాలన విధులు మరింత చురుకుగా సులువుగా జరిగేలా చర్యలు చేపడతామని అన్నారు.

# కలెక్టర్‌కు కాంగ్రెస్ నేతల సత్కారం



**ఆదిలాబాద్ మహా :** ఇటీవల ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుని ఆదిలాబాద్ జిల్లాకు దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిపెట్టిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, బండారి సతీష్ , సంద నర్సింగ్, చిన్నయ్య ,ప్రశాంత్ శాలువాతో కలెక్టర్ ను సత్కరించారు.మరిన్నిఅవార్డులు సాధించి దేశంలోనే అదిలాబాద్ జిల్లాకు మరింతగా కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రస్థాయి క్రీడల ఎంపిక



**జైనూరు, మహా :** రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలకు కోహినూర్ (కే) ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు), సిర్పూర్ (యు) మండలం విద్యార్థినిలు ఎంపికయ్యారు.కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ) మండల కేంద్రంలో జరిగిన జోనల్ లెవెల్ గిరిజన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూసం నాందేవ్ తెలిపారు.కబడ్డీ సీనియర్ విభాగంలో కె. మంజుల , వాలీబాల్ జూనియర్ విభాగంలో పి. పుల్లవంతి, కె. లక్ష్మి , ఖోఖో సీనియర్ విభాగంలో ఎం. గౌరు , క్యారం జూనియర్ విభాగంలో జి. లావణ్య, ఎస్. శిరీష , చెస్ జూనియర్ విభాగంలో ఎం. లావణ్య , అథ్లెటిక్స్ సీనియర్ విభాగంలో జి. రమేశ్వర్, జూనియర్ విభాగంలో హెచ్.కే. గౌరు, ఎస్. శ్రీమలరాణి , హైజంప్ సీనియర్ విభాగంలో హెచ్.కే. దుర్గాదేవి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. మొత్తం 13 మంది విద్యార్థినిలు రాష్ట్ర స్థాయిలో పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకే గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఎంపికైన విద్యార్థినిలను జైనూర్ ఏటిడిఓ శ్రీనివాస్ అభినందించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ కనక వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు లక్ష్మణ్ రావు, పూల్ సింగ్, మాధవి, లక్ష్మి, భాగ్యలక్ష్మి, అరుణ, అరవింద్,శశికళ,దన్లాల్, పారుబాయి తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

- హమాలీలకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి
- బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన




**మంచిర్యాల, మహా :** లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో లక్షట్టిపేట ఉత్కూర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టి, జీవో పత్రాలను కాల్చివేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ హాజరై మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చే విధంగా లేబర్ కోడ్స్ నిన్నటి రోజున అమలుకు నోటిఫికేషన్ జారీ జారీ చేసిందని వెల్లడించారు. ఈ చర్య అత్యంత దుర్మార్గం అని అన్నారు. ఈ లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల మెడలకు ఉరితాళ్లుగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఫిక్స్ డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేర్లతో యజమానులకు అనుకూలంగా కార్మికులతో పని చేయించుకుని మళ్లీ కార్మికులను తొలగించడానికి ఈ కోడ్ అమలు చేసే పరిస్థితులు ఉంటాయని తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగాలను తొలగిస్తూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన కార్మికులతో శ్రమ దోపిడీ చేసే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా, కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ఈ లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు కార్మిక వర్గం కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అశోక్, హామలి సంఘం అధ్యక్షులు చంద్రయ్య, రమేష్, రాజన్న, మల్లయ్య, సత్తన్న, శ్రీను, సతయ్య రవి పాల్గొన్నారు.



## టీజీటీఏ అధ్యక్షుడిగా

# మందమర్రి తాసిల్దార్

**మందమర్రి, మహా :** మందమర్రి మండల తాసిల్దార్ పి సతీష్ కుమార్ మంచిర్యాల జిల్లా టీజీటీఏ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శాలువా, పూలగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీజీటీఏ జిల్లా స్థాయిలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. అలాగే టీజీటీఏ ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివై తాసిల్దార్ సంతోష్, ఆర్.ఐ. రాథోడ్ గణపతి, రాజమణి, హనుమంతు, తిరుమల, అంజలి, వేణు, ప్రతిభ, రామారావు, రాజేంద్ర ప్రసాద్ , సారయ్య, ఇమాం , అలేఖ్య, శౌర్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పాలిట శాపాలు

# నాలుగు లేబర్ కోడ్‌లు

**రెబ్బెన మహా :** కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టడాన్ని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందని బెల్లంపల్లి టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్ అన్నారు.కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ లలో ఒకటైన ఇండస్ట్రియల్ రిలేషన్ లో రానున్న రోజులలో యూనియన్ల ఉనికి లేకుండా కనుమరుగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అంతే కాకుండా వారంలో 48 గంటల పని చేయాలని చెబుతూ రోజులో మాత్రం 12 గంటల వరకు పనిచేయాలని చెప్పడం కార్మికుల మీద పని ఒత్తిడి పెంచినట్టు భావించాల్సిఉంటుందన్నారు. షార్ట్ టర్మ్ ఉద్యోగాల వలన రానున్న రోజులలో పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా ప్రతి ఒక్క కంపెనీ కూడా నాలుగు సంవత్సరాల కు మాత్రమే ఉద్యోగాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు .మొత్తంగా ఈ నాలుగు చట్టాలు యాజమాన్యాలకు పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని విమర్శించారు. సింగరేణిలో మాత్రం కొత్త యూనియన్లు వచ్చే పరిస్థితి ఉండదని ఉన్న యూనియన్లను నడిపే పరిస్థితి కూడా ఉండక పోవచ్చన్నారు..కావున నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే విరమించుకోవాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం తరపున డిమాండ్ చేసారు.

# రోడ్ల అభివృద్ధితోనే గ్రామాల అనుసంధానం

## చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేనా భీంభరత్

### కనకమామిడి గ్రామంలో మంజూరైన పంచాయతీ రోడ్డుకు టెండర్లు పూర్తి



**మొయినాబాద్ మహా:** రోడ్ల అభివృద్ధితోనే గ్రామాల అనుసంధానం పెరుగుతుందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేనా భీంభరత్ పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో నూతనంగా మంజూరైన పంచాయతీ రోడ్డుకు టెండర్లు పూర్తి కావడంతో ఈ సందర్భంగా శనివారం చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీంభరత్ రోడ్డును సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రోడ్లు అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు విద్యా వైద్య అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. రోడ్డుకు టెండర్లు పూర్తి అయిన సందర్భంగా కనకమామిడి గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ... గ్రామస్తులందరూ కలిసి భీంభరత్ ను అభినందిస్తూ.. శాలువలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పెంటా రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి, ఆకుల పద్మారావు, గూడూరు లక్ష్మి శ్రీనివాస్, ఎం.ఎస్.రత్నం, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచులు సత్యనారాయణ, భద్రప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాలకృష్ణారెడ్డి, జైరాంరెడ్డి, సొసైటీ డైరెక్టర్ రాఘవేందర్ రెడ్డి, మహేష్, హరేందర్, వంశీధర్ రెడ్డి, గుర్రాల భాస్కర్, మైసన్ రవి, యాదయ్య, గ్రామస్తులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నివారిస్తాం

- అందరి సహకారంతో సురక్షిత ప్రయాణం సాధిద్దాం
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, మహా :** ఈ మధ్య తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను ప్రజల సహకారంతో నివారిస్తామని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝ స్పష్టం చేశారు. శనివారం రామగుండం సీపీ మంచిర్యాల జోన్ వేంపల్లి ముల్కల బ్రిడ్జ్, గుడిపేట వద్ద ఉన్న బ్రిడ్జ్, ఇతర ప్రాంతాలలో ఆర్ అండ్ బి శాఖ, ఎక్సైజ్, ఆర్టీవో, హైవే ఇంజనీర్ అధికారులతో పాటు గ్రామ రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యుల సమన్వయంతో కలిసి పర్యటించారు. గతంలో ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం వాటిల్లిన 'బ్లాక్ స్పాట్' లను స్వయంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు గల సాంకేతిక కారణాలను విశ్లేషించి, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఆయా చోట్ల ప్రమాదాలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. బ్లాక్ స్పాట్ ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, రంబుల్ స్టిక్స్, వేగనియంత్రణ సూచికలు, రాంగ్ రూట్లో వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు. కమీషనరేట్ పరిధిలో తరుచూ ప్రమాదాలు జరిగే గుర్తించి రోడ్ సేఫ్టీ కమిటీ లు ఏర్పాటు చేసి, అన్ని శాఖ ల సమన్వయము తో ప్రమాదాలకు గల కారణాలు గుర్తించి వాటి నివారణ మార్గాలు చేపట్టాలని అన్నారు. అతివేగంతో బాధ్యతరహిత్య ప్రయాణాల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల వలన ఎక్కువగా కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పక ధరించాలని విద్యార్థులకు సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపరాదని తెలిపారు. చలికాలంలో మంచు వల్ల రోడ్డు స్పష్టంగా కనిపించకపోవడం కూడా ప్రమాదాలకు ఒక కారణమని దానికి తగిన విధంగా జాగ్రత్తలు తీసుకొని నెమ్మదిగా ప్రయాణించాలని కోరారు. ప్రధాన రహదారి పై నిరంతర పెట్రోలింగ్ చేస్తూ రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐ అశోక్ కుమార్, రోడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, మున్సిపల్ కమీషనర్ తదితరులు పాల్గొన్నారు.



# అబద్దాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్..!

## జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కేవలం అబద్దాలతోనే కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ పార్టీకి సర్పంచ్ ఎన్నికల సందర్భంగా తగురీతిలో బుద్ధిచెప్పాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగిన మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు, మహిళలు, యువత కాంగ్రెస్ పార్టీ తమకిచ్చిన హామీలను గుర్తు చేసుకొని సమాధానం చెప్పడానికి ఇదే సరైన సమయమని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం ద్వారా దశలవారీగా ప్రతి దళిత కుటుంబానికి పది లక్షల రూపాయల సాయం అందించడానికి కృషి చేసిందని, నాడు అందరికీ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ, ఒక్క కుటుంబానికి కూడా సాయం చేయలేదని విమర్శించారు. అంబేద్కర్ అభయహస్తం పేరిట అన్ని దళిత కుటుంబాలకు 12 లక్షల ఆర్థిక చేయూత అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మరిచిపోయారని దుయ్యబట్టారు. కేసీఆర్ కిట్, అమ్మఒడి తదితర పథకాలను రద్దు చేసారని, గర్భిణిలు, పిల్లల పౌష్టికాహారం పథకానికి తూట్లు పొడిచారని మండిపడ్డారు. ఉద్యోగులు పిఆర్సీ, ఆరు పెండింగ్ డిఎలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అడిగితే వారిని ప్రజా వ్యతిరేకులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కేసీఆర్ పాలనలో గాడిలో పడిన వ్యవసాయ రంగం, కాంగ్రెస్ పాలనలో మళ్లీ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఎన్నికల కోసం చీరలు పంచడం తిరిగి మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికలలో కీలెరిగి వాతలు పెడితే కాంగ్రెస్ పార్టీకి తాను చేసిన మోసం ఏమిటో తెలుస్తుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి కృపేష్, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బిట్ల వెంకట్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు దేరంగుల నర్సింహ్మ, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి భాస్కర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, మాజీ సర్పంచులు కాలె గణేష్, బల్వంత్ రెడ్డి, యాదగిరి, బీరప్ప, దానయ్య గౌడ్, మాజీ ఎంపిటిసిలు అచ్చన శంకర్, రవీందర్, మైసయ్య, సొసైటీ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# వందలాది ఇంజనీర్ల తొలగింపు.. 2026లో మరోమారు!



ప్రముఖ ఈ కామర్స్ కంపెనీ అమెజాన్ 2025 అక్టోబర్ నెలలో 14,000 కంటే ఎక్కువ తొలగింపులను ప్రకటించింది. ఈ ప్రభావం క్లౌడ్ సర్వీసెస్, గ్రోసరీ, రిటైల్, ప్రకటనలకు సంబంధించిన విభాగాలపై మాత్రమే కాకుండా.. ఇంజనీర్ బృందాలపై కూడా పడింది. అమెజాన్ తొలగింపులలో 1,800 మంది ఇంజనీర్లు ఉన్నారని.. న్యూయార్క్, కాలిఫోర్నియా, న్యూజెర్సీ, వాషింగ్టన్ లేఆఫ్స్ రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఈ రాష్ట్రాల్లో మొత్తం ఉద్యోగుల తొలగింపులు 4,700 కంటే ఎక్కువగా ఉన్నాయి. కానీ ఇందులో 40 శాతం ఇంజనీర్లే ఉన్నట్లు.. వర్కర్ అడ్జస్ట్‌మెంట్ అండ్ రీట్రైనింగ్ నోటిఫికేషన్ (WARN) ఫైలింగ్‌ల ద్వారా అమెజాన్ వెల్లడించింది. కాగా జనవరి 2026లో కూడా మరోసారి ఉద్యోగుల తొలగింపులు ఉంటాయని కొందరు చెబుతున్నారు. కంపెనీ ఖర్చులను తగ్గించడంలో భాగంగానే.. అమెజాన్ ఈ ఉద్యోగుల తొలగింపును చేపట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగం పెరగడం వల్ల.. మరిన్ని ఉద్యోగాల కోతలకు దారితీసే అవకాశం ఉందని 2025 జూన్‌లో సంస్థ సీఈఓ ఆండీ జాస్సీ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అమెజాన్ కంపెనీలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల సంఖ్య 15.5 లక్షలు.




# ఉద్యోగుల గ్రాట్యుటీకి ఇక ఏడాది చాలు

కార్మిక చట్టాలలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులను ప్రవేశపెట్టింది. కొత్త లేబర్ కోడ్‌ల ప్రకారం.. అన్ని రంగాల్లోని ఉద్యోగులు ఇప్పుడు కేవలం ఒక సంవత్సరం సర్వీస్ ఉంటే చాలు గ్రాట్యుటీకి అర్హులు అవుతారు. దేశంలో ఇప్పటివరకూ ఉన్న 29 కార్మిక చట్టాలను ప్రభుత్వం నాలుగు సరళీకృత లేబర్ కోడ్‌లుగా ఏకీకృతం చేసింది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపిన ప్రకారం.. ఉద్యోగులకు మెరుగైన వేతనాలు, విస్తృత సామాజిక భద్రతా కవరేజ్, మెరుగైన ఆరోగ్య రక్షణ అందించడమే ఈ మార్పుల లక్ష్యం. ఈ సంస్కరణలు అనధికారిక కార్మికులు, గిగ్ , ప్లాట్‌ఫామ్ వర్కర్లు, వలస కార్మికులు, మహిళా ఉద్యోగులు వంటి విభిన్న వర్గాలకు వర్తిస్తాయి.

**గ్రాట్యుటీ అర్హతలో భారీ మార్పు**

పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ యాక్ట్ ప్రకారం.. ఇప్పటిదాకా ఒక ఉద్యోగి ఐదు సంవత్సరాల నిరంతర సర్వీస్ పూర్తి చేసుకున్న తర్వాతే గ్రాట్యుటీకి అర్హుడు. అయితే, కొత్త లేబర్ కోడ్‌ల అమలుతో నిర్ణీత కాలానికి అంటే రెండేళ్లకో.. మూడేళ్లకో ఒప్పందంపై చేరే ఉద్యోగులు (ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయీస్ (FTEs) కూడా ఇప్పుడు ఏడాది సర్వీస్ అనంతరం గ్రాట్యుటీకి అర్హత పొందుతారు.

మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం.. ఈ మార్పు ఫిక్స్డ్ టర్మ్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులతో సమాన హోదాలోకి తీసుకురావడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త నిబంధనల ప్రకారం.. ఫిక్స్డ్ టర్మ్ ఉద్యోగులు కూడా శాశ్వత ఉద్యోగుల మాదిరిగానే జీతాలు, సెలవు సదుపాయాలు, వైద్య ప్రయోజనాలు, సామాజిక భద్రతా పరిరక్షణలు పొందుతారు.

**గ్రాట్యుటీ అంటే..**

గ్రాట్యుటీ అనేది ఉద్యోగి దీర్ఘకాలిక సేవకు గుర్తింపుగా కంపెనీల యాజమాన్యాలు చెల్లించే ఆర్థిక ప్రయోజనం. సాధారణంగా, ఒక ఉద్యోగి రాజీనామా చేసినప్పుడు, పదవీ విరమణ చేసినప్పుడు లేదా అర్హతగల సర్వీస్ కాలాన్ని పూర్తి చేసినప్పుడు ఈ మొత్తం చెల్లిస్తారు.

**లెక్కిస్తారిలా..**

ఉద్యోగికి చెల్లించే గ్రాట్యుటీ మొత్తం ఈ ఫార్ములాతో లెక్కిస్తారు.

గ్రాట్యుటీ = (చివరిగా అందుకున్న వేతనం) × (15/26) × (సర్వీస్ కాలం సంవత్సరాల్లో)

ఇక్కడ చివరిసారిగా అందుకున్న వేతనం అంటే బేసిక్ పే, డియర్నెస్ అలవెన్స్ (DA) కలిపి తీసుకోవాలి. ఉదాహరణకు ఒక ఉద్యోగి 5 సంవత్సరాలు పనిచేసి చివరిగా బేసిక్, డీఏ కలిపి రూ.50 వేలు అందుకున్నారనుకుంటే.. గ్రాట్యుటీ రూపంలో సదరు ఉద్యోగి అందే మొత్తం రూ.1,44,230 అవుతుంది.



# ఏ రంగమైనా.. హైదరాబాద్ టాప్!

ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫుడ్ అండ్ బేవరేజెస్.. రంగమేదైనా సరే.. హైదరాబాదే టాప్ లీడర్. అవునండీ.. గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ)కు హైదరాబాద్ అడ్డాగా మారింది. దేశంలోని ప్రధాన నగరాలైన బెంగళూరు, చెన్నై, పుణె, ఢిల్లీ, ముంబైని దాటేసి బహుళ జాతి సంస్థలు హైదరాబాద్‌లో జీసీసీల ఏర్పాటుకు జై కొడుతున్నాయి. కొత్త జీసీసీల ఏర్పాటే గానీ ఇప్పటికే ఉన్న జీసీసీల విస్తీర్ణంలో గానీ భాగ్యనగరాన్నే తొలి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయి. అందుబాటు ధరలు, తక్కువ జీవన వ్యయం, మెరుగైన మౌలిక వసతులు, నైపుణ్య కార్మికుల లభ్యత, ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాలు, కాస్మోపాలిటన్ కల్చర్ వంటివి ఇందుకు ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరినవంబర్ మధ్య కాలంలో దేశంలో 88 జీసీసీలు ఏర్పాటు, విస్తరణ కాగా.. ఇందులో 46 శాతం వాటాతో భాగ్యనగరం తొలి స్థానంలో నిలిచింది. మన తర్వాతే 33 శాతం వాటాతో బెంగళూరు నగరం రెండో స్థానంలో నిలిచింది. వచ్చే ఏడాది ముగింపు నాటికి రాష్ట్రంలో 120 జీసీసీలు, 1.2 లక్షల ఉద్యోగాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**జీసీసీ - ఉమెన్**

తెలంగాణలోని మొత్తం జీసీసీ నైపుణ్య కార్మికులలో 59 శాతం మంది, అంటే సుమారు 1.82 లక్షల మంది ఐటీ, ఐటీఈఎస్ రంగంలోనే కేంద్రీకృతమై ఉన్నారు. బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, తయారీ రంగాల జీసీసీలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జీసీసీ నిపుణులలో మహిళలు 33 శాతం మంది ఉండగా.. 19 శాతం మంది నాయకత్వ ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. రాష్ట్రంలోని మొత్తం జీసీసీ ఉపాధిలో ఇంజనీరింగ్, ఐటీ రంగాలు 57 శాతం వాటాతో ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి.

# డార్క్ ప్యాటర్న్స్‌పై 26 సంస్థల సెల్ఫ్ డిక్లరేషన్

వినియోగదారులను మోసపుచ్చేలా, తప్పుదోవ పట్టించే సమాచారం, అసమంజస వాణిజ్య విధానాలకు (డార్క్ ప్యాటర్న్స్) తమ ప్లాట్‌ఫాంలలో తావు లేదంటూ 26 టాప్ ఈ-కామర్స్ కంపెనీలు స్వచ్ఛందంగా సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చినట్లు కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) వెల్లడించింది. ఇలాంటి ధోరణులను గుర్తించేందుకు, తొలగించేందుకు సదరు సంస్థలు అంతర్గతంగా లేదా బైటి ఏజెన్సీలతో ఆడిట్ నిర్వహించాయని పేర్కొంది. సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చిన సంస్థల జాబితాలో జెప్టో, బిగ్‌బాస్కెట్, జొమాటో మొదలైనవి ఉన్నాయి. ఇతర ఈ-కామర్స్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్లు, యాప్ డెవలపర్లు కూడా నిబంధనలను పాటించడంపై దృష్టి పెట్టాలని సీసీపీఏ సూచించింది. డార్క్ ప్యాటర్న్స్ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.





## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# దాదాపు రెండు దశాబ్దాల జ్ఞాపకం.. అసలా విమానం ఉన్నట్టే తెలియదు!

ఎయిరిండియాలో ఒక వింత సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒక పాత బోయింగ్ 737200 కార్గో విమానాన్ని 13 ఏళ్లుగా అసలు అలాంటి ఒక విమానం ఉందన్న విషయాన్నే మర్చిపోయింది. గత వారమే దీన్ని విక్రయించింది. మరి గత దశాబ్దంన్నర కాలంగా పట్టించుకోకుండా వదిలేసిన విమానం గురించి ఎలా తెలిసింది? ఎలా విక్రయించింది? "పాత విమానాలను అలా వదిలేయడం అసాధారణం కానప్పటికీ,ఇటీవలి దాకా ఇలాంటి విమానం ఒకటి ఉందీ అనేది తెలియదు! కాలక్రమేణా, అది జ్ఞాపకంగా మిగిలిపోయింది. కోల్‌కతా విమానాశ్రయంలోని రిమోట్ పార్కింగ్ బేలో ఉన్న దీని గురించి చెప్పి, దానిని తీసివేయమని అడిగినప్పుడు మాత్రమే వెలుగులోకి వచ్చింది! నిజంగా అది మనదేనా ధృవీకరించిన తర్వాత, విక్రయించాం అని ఎయిరిఇండియా సీఈవో కాంప్‌బెల్ విల్సన్ సిబ్బందికి పంపిన సందేశంలో చెప్పారు. గత 13 ఏళ్ల కోల్‌కతా విమానాశ్రయంలోని రిమోట్ పార్కింగ్ బేలో అలా పడి ఉంది. గత 13 ఏళ్లకు పైగా దీని ఉనికిని మరచిపోయింది సంస్థ ప్రైవేటీకరణ తర్వాత దాదాపు మూడు సంవత్సరాల తర్వాత కార్గో విమానం బయటపడింది, అధికారులు టాటా గ్రూప్ కంపెనీని కోల్‌కతా విమానాశ్రయ ప్రాంగణం నుండి దానిని తీసివేయమని కోరారు. దీంతో ఈ విమానాన్ని సేల్ చేసింది ఎయిరిండియా. కాగా 2012లో తన కార్గో వ్యాపారాన్ని మూసివేసింది ఎయిరిండియా. గతంలో బోయింగ్ 737200 కార్గో విమానాలను నిర్వహించింది. వ్యాపారాన్ని మూసివేసిన నేపథ్యంలో ప్రస్తుతం కార్గో విమానాలను ఉపయోగించడం లేదు. విమాన ట్రాకింగ్ వెబ్‌సైట్ planspotters.netలో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం VT EHH 43.2 సంవత్సరాల కంటే పాతది మరియు సెప్టెంబర్ 1982లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు డెలివరీ చేయబడింది. ఈ విమానాన్ని ఫిబ్రవరి 1998 లో అలయన్స్ ఎయిర్ లీజుకు తీసుకుంది. జూలై 2007లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ సరుకు రవాణాకోసం దీన్ని ఉపయోగించారు. రెండు విమానయాన సంస్థల విలీనం తరువాత ఇది ఎయిరిండియాకు వచ్చింది.






# రీల్ ఎంత పని చేసింది రాములా!

సోషల్ మీడియా అల్గారిథం ఎప్పుడు ఎలా పని చేస్తుందో?.. ఎప్పుడు ఏది వైరల్ అవుతుందో అర్థం కాని పరిస్థితి. అందుకే పోస్టులు, వీడియోలు పెట్టే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే పెళ్లి కాబోతుందన్న సంబురంలో.. ముందు వెనకా ఆలోచించకుండా ఓ వీడియో తీసుకుని పోస్ట్ చేసి చిక్కుల్లో పడ్డాడు ఇక్కడో వైద్యుడు. ఇక్కడి ఈ కింది వీడియోలో బనీయన్ మీద కిందపడి మరీ దొర్లుతూ డ్యాన్స్ చేస్తున్న వ్యక్తి ఓ డాక్టర్. ఆ పక్కనే ఒయలు ఒలకబోస్తోంది అతనికి కాబోయే భార్య. ఇద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగింది. ఎవరికేం నొప్పి అంటారా? అక్కడికే వస్తున్నాం. ఆ డ్యాన్స్ తన బెడ్‌రూంలో వేస్తే ఫర్వాలేదు. కానీ, ఆస్పత్రి లోనే దుకాణం పెట్టేశాడు. ఆస్పత్రి గదిలో.. అదీ ఎమర్జెన్సీ డ్యూటీని ఎగ్గొట్టి మరీ తనకు కాబోయే భార్యతో డ్యాన్స్ చేశాడు షామ్లీ ప్రభుత్వాసుపత్రి వైద్యుడు డాక్టర్ వకార్ సిద్ధిఖీ. ఈ వీడియో కాస్త నెట్టింట రీల్ రూపంలో వైరల్ అయ్యింది. అటు తిరిగి.. ఇటు తిరిగి.. ఆఖరికి అధికారుల దృష్టికి చేరింది. దీంతో సిద్ధిఖీని వివరణ కోరారు. అయితే ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో విధుల నుంచి తొలగించి.. ఆయనకు కేటాయించిన బంగ్లాను సైతం ఖాళీ చేయించారు. బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వకార్ సిద్ధిఖీ రెండేళ్ల కాంట్రాక్ట్ కింద ఆ ఆస్పత్రిలో చేరారని.. అతని ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఒకవైపు డాక్టర్ల కొరత కొనసాగుతున్నవేళ.. ఈ కాంట్రాక్ట్ డాక్టర్ చేసిన పని ప్రజాగ్రహానికి దారి తీసింది.



# నూడుల్స్ ప్యాకెట్‌లో బల్లి

చెన్నై: తిరుపూర్ సమీపం కున్నత్తూర్‌లోని దొరవలూర్ రోడ్డుకు చెందిన ఆనందకుమార్(35) పాఠశాల ముగించుకుని ఇంటికి వచ్చిన తన పిల్లలకు వంట చేయడానికి అదే ప్రాంతంలోని ఒక కిరాణా దుకాణం నుండి ప్రముఖ బ్రాండ్ నుంచి నూడుల్స్ ప్యాకెట్‌ను కొనుగోలు చేశాడు. నూడుల్స్ వండడానికి ప్యాకెట్‌ను తెరిచినప్పుడు, నూడుల్స్‌లో చనిపోయిన బల్లి తల ఇరుక్కుపోయి ఉండడం చూసి అతను దిగ్భ్రాంతి చెందాడు. ఆ తర్వాత నూడుల్స్‌కు అంటుకున్న బల్లి చనిపోయిన తలను వీడియో తీసి తన స్నేహితులకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అది ఇప్పుడు వైరల్ అయి సంచలనం సృష్టించింది. ప్రముఖ బ్రాండ్ కంపెనీలు ఆహార ఉత్పత్తులను అమ్ముతున్నాయని కొందరు సామాజిక కార్యకర్తలు అంటున్నారు. మానవ శ్రమకు బదులుగా ఆధునిక యంత్రాలను ఉపయోగించి తయారు చేసే ఆహార ఉత్పత్తులలో ఇటువంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇంకా ప్రసిద్ధ కంపెనీల ప్యాకెట్లు ప్లాస్టిక్‌తో తయారు చేయబడినందున, ఆహార ఉత్పత్తులను తిన్న తర్వాత ప్రజలు వివిధ శారీరక సమస్యలను ఎదుర్కొంటారు. బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ కవర్లను విసిరేయడంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుంది. వ్యర్థాల నిర్వహణలో స్థానిక అధికారులకు భారీ సమస్య ఏర్పడుతుంది. ఆహార ఉత్పత్తులను ఇలా ప్యాకేజ్ చేసి విక్రయించే సంస్థలతో కలిగే ప్రమాదాలను ఆహార భద్రతా శాఖ నియంత్రించాలని వారు అన్నారు.

# అణు దాడులను తట్టుకునేలా ఐస్‌లాండ్



చైనా దేశం మరో భారీ నిర్మాణానికి సిద్ధమయ్యింది. ప్రపంచంలోనే తొలిసారిగా భారీ కృత్రిమ ద్వీపం నిర్మాణాన్ని డ్రాగన్ కంట్రీ చేపడుతుంది. ఈ ద్వీపాన్నిఅణు బాంబు దాడులను సైతం తట్టుకునేలా నిర్మిస్తున్నట్లు ఆ దేశ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కొత్త కొత్త నిర్మాణాలతో ప్రపంచ దేశాలని ఆశ్చర్యపరిచే డ్రాగన్ కంట్రీ మరో భారీ నిర్మాణం చేపడుతుంది. అణుబాంబు దాడులను సైతం తట్టుకునేలా భారీ కృత్రిమ ద్వీపనిర్మాణం నిర్మిస్తున్నట్లు అక్కడి శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ఐస్ లాండ్ ఆరు నుంచి తొమ్మిది మీటర్ల ఎత్తైన అలలను తట్టుకోవడంతో పాటు కఠినమైన తుఫానులను సైతం ఎదుర్కొనేలా రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఏర్పరిచిన సామాగ్రి 238 మందికి నాలుగు నెలల పాటు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ద్వీపంలో అన్ని రకాల ఎమర్జెన్సీ కంపర్ట్ మెంట్ లు నిర్మిస్తున్నామని, వాటిలో ఎమర్జెన్సీ పవర్, కమ్యూనికేషన్ అండ్ నావిగేషన్ కంట్రోల్ సిస్టమ్ ఉంటుందని తెలిపారు. ఈ ద్వీపం 138 మీటర్ల పొడవు, 85 మీటర్ల వెడల్పుతో నీటి మట్టానికి 45 మీటర్ల ఎత్తు ఉండేలా దీని నిర్మాణం చేపడుతున్నట్లు చైనా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. దీని బరువు 78 వేల టన్నులుని తెలిపారు. అన్ని రకాల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేలా దీని నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. డీప్‌సీ ఆల్‌వెదర్ రెసిడెంట్ ఫ్లోటింగ్ రీసెర్చ్ ఫెసిలిటీగా పిలవబడే ఈ ద్వీప నిర్మాణం 2028 వరకూ పూర్తి చేయనున్నట్లు అక్కడి శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా ఇటీవలే చైనాలో నిర్మించిన ఓ భారీ వంతెన ప్రారంభించిన కొద్ది రోజులకే కూలిపోయింది. దీంతో నాసిరకం నిర్మాణాలు చేపట్టారని ఆ దేశ ఇంజనీర్లపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

# హిందువులు ఉనికి కోల్పోతే.. ప్రపంచమే ఉండదు: మోహన్ భగవత్




ఇంఫాల్: హిందువులు ఉన్నంత వరకు ప్రపంచం ఉంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) అధినేత మోహన్ భగవత్. భారత నాగరికత ఇప్పటి వరకు నిలిచింది.. భవిష్యత్‌లోనూ ఉంటుంది. ఇప్పటికే పలు దేశ నాగరికతలు కాలగర్భంలో కలిసిపోయాయని చెప్పారు. కానీ మన భారతదేశ నాగరికత అమరమైందని వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలు చెలరేగిన తర్వాత ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ తొలిసారిగా అక్కడ పర్యటించారు. ఈ క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన ఓ సభలో ఆయన మాట్లాడుతూ..'ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని రకాల పరిస్థితులను చూసింది. భారతదేశ నాగరికత ఎప్పటికీ అలాగే ఉంటుంది. హిందువులు ఉనికి కోల్పోతే.. ప్రపంచానికే ఉనికి ఉండదు. ప్రతిఒక్కరూ మారుతున్న పరిస్థితుల గురించి ఆలోచించాలి. ఎందుకంటే భారత సమాజంలో మంచి సంబంధాలు ఉన్నాయి. అందువల్ల హిందూ సమాజం ఉండి తీరుతుంది. సమాజానికి ఏం కావాలో దాన్ని హిందూ సమాజం సాధిస్తుంది. అది ఈశ్వరుడి కర్తవ్యం అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో, యునాన్ (గ్రీస్), మిస్ర (ఈజిప్ట్), రోమా దేశ నాగరికతలు కాలగర్భంలో కలిసిపోయాయని చెప్పారు. మరోవైపు.. అమెరికా సుంకాల విధింపు విషయమై ఆయన స్పందిస్తూ..'దేశ నిర్మాణానికి బలం చాలా అవసరమన్నారు. బలం అంటే ఆర్థిక సామర్థ్యం అని చెప్పుకొచ్చారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ఎవరిపైనా ఆధారపడకూడదని సూచించారు. ఇది కష్టతరమైనది ఏం కాదు అంటూ వ్యాఖ్యలు చేశారు. చివరగా.. నక్సలిజాన్ని సమాజం అంగీకరించబోదని.. అది ముగిసిన అధ్యయనం అని తెలిపారు. ఈ సందర్భంగా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారత దేశం చేసిన స్వాతంత్ర్య పోరాటాన్ని ఉదాహరణగా ఉదహరించారు. భారతదేశంలో బ్రిటిష్ సూర్యుడు అస్తమించాడని చెప్పారు.



# ఈ మూవీ హిట్టయితే పిశాచి 2 రిలీజ్ చేస్తా!

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకుంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది నటి ఆండ్రియా. ఈమె మంచి గాయని అన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ బ్యూటీ రచయితగా, నిర్మాతగా మారింది. ఈమె కథను అందించి ది షో మస్ట్ గో ఆన్ పతాకంపై నిర్మించిన చిత్రం మాస్క్. బ్లాక్ మెడ్రాస్ ఫిలింస్ సంస్థతో కలిసి ఆండ్రియా ఈ చిత్రాన్ని నిర్మించింది. రుహాని శర్మ హీరోయిన్‌గా నటించిన ఇందులో ఛార్లీ, రమేష్ తిలక్, కల్లూరి వినో, రెడిన్ కింగ్‌స్లీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. వెట్రిమారన్ మార్గదర్శకత్వంలో వికర్ణన్ అశోక్ అనే యువ దర్శకుడు తెరకెక్కించాడు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని, ఆర్‌డీ.రాజశేఖర్ ఛాయాగ్రహణం అందించారు. ఆండ్రియా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర పోషించగా హీరో కెవిన్ కథానాయకుడిగా నటించారు. యాక్షన్ ఎంటర్‌టైనర్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని శుక్రవారం (నవంబర్ 21న) తెరపైకి వచ్చింది. ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆండ్రియా.. మాస్క్ మూవీ విజయంపై చాలా ఆశలే పెట్టుకుంది. కాగా ఈమె నటించిన మరో చిత్రం పిశాచి 2. మిష్కిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని చాలా కాలం అయ్యింది. అయితే కొన్ని ఆర్థికపరమైన సమస్యల కారణంగా విడుదల కాలేదు. ఆ చిత్రం గురించి నటి ఆండ్రియా వద్ద ప్రస్తావించగా.. తాను నిర్మించిన మాస్క్ మంచి విజయాన్ని సాధిస్తే ఆ తరువాత పిశాచి 2 చిత్రాన్ని తానే విడుదల చేస్తానంది. దీంతో మాస్క్ చిత్ర హిట్‌పై పిశాచి 2 చిత్ర విడుదల ఆధారడిందన్నమాట!






# రవిని కాదు.. ముందు వాళ్లను అరెస్ట్ చేయండి - ఆర్జీవీ

సినీ పరిశ్రమను ఊపిరాడకుండా చేస్తున్న పైరసీ సమస్య గురించి దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐబొమ్మ రవి అరెస్ట్ తర్వాత కూడా పైరసీ ఆగదని ఆయన చెప్పారు. టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందడం, పోలీసింగ్ చాలా బలహీనంగా ఉండటం వల్లనే ఇలాంటి వెబ్‌సైట్లు వస్తున్నాయనుకుంటే పొరపాటే అన్నారు. పైరేటెడ్ సినిమా చూడటానికి పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు ఉన్నంత కాలం వారికి సర్వీస్ అందించడానికి రవి లాంటి సరఫరాదారులు ఎల్లప్పుడూ ఉంటారని ఆర్జీవీ పేర్కొన్నారు. చాలామంది నెటిజన్లు రవిని రాబిన్ హుడ్‌తో పోలుస్తున్నారని ఆర్జీవి (RGV) ఇలా అన్నారు. 'రాబిన్ హుడ్ హీరో కాదు.. నేటి నిర్వచనాల ప్రకారం చూస్తే, అతను ప్రపంచంలోనే మొట్టమొదటిగా నమోదైన ఉగ్రవాది. అతను ఉన్నవారిని దోచుకుని, చంపి, లేనివారికి ఇస్తాడు. అలా అయితే ధనవంతులు చేసిన ఏకైక నేరం వారు ధనవంతులు కావడమేనా.. కష్టపడి ఆర్థికంగా విజయం సాధించిన వారిని దోచుకోవడం ఎంత నీచమైనదో ఊహించుకోండి. నేరస్థుడిని సాధువుగా చూపించడానికి టన్నుల కొద్దీ అజ్ఞానం అవసరం' అని ఆర్జీవీ పేర్కొన్నారు. పైరసీ విషయంలో లాజిక్స్ కొన్ని పాయింట్స్ చెబుతున్నవారికి కూడా వర్మ కౌంటర్ ఇచ్చారు. 'సినిమా ఖరీదైనదా..? -పైరసీ ఓకే, పాప్‌కార్న్ ఖరీదా..? — సినిమాను లీక్ చేయండి, మూవీ టికెట్ రేట్లు ఎక్కువా..? -పైరసీ ఓకే ఈ లాజిక్ ప్రకారం చూస్తే.. BMW కారు ఖరీదైతే షోరూమ్‌ను దోచుకోవాలి కదా.. మురికివాడలో ఉన్న అందరికీ ఆ కార్లను ఇవ్వాలి కదా.. అలా ఎందుకు చేయరని ప్రశ్నించారు. బంగారం (Gold) ఖరీదైనదే కదా.. ఆ దుకాణాన్ని దోచుకుని ఉచితంగా ఎందుకు పంపిణీ చేయరంటూ.. అన్ని వస్తువులకు ఇదే లాజిక్ వర్తిస్తుందని గుర్తుచేశారు. ఇలాంటి ఆలోచనలు సమాజంలో అరాచకానికి దారితీస్తాయని వర్మ హెచ్చరించారు.



# ఆయనతో నటిస్తూ ఎంజాయ్ చేశా: కృతి

కోలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ అనే తారతమ్యం లేకుండా నటిస్తూ పాన్ ఇండియా కథానాయకుడిగా రాణిస్తున్న నటుడు ధనుష్. అదేవిధంగా నటుడిగా, కథకుడిగా, గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా సత్తా చాటుతున్న ఈయన ప్రస్తుతం పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. అలా ధనుష్ నటిస్తున్న తాజా చిత్రాల్లో తేరే ఇష్క్ మే హిందీ చిత్రం ఒకటి. కృతిసనన్ నాయకిగా నటించిన ఈ చిత్రానికి ఏఆర్.రెహ్మన్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్ర ఆడియో ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లి గుడ్ టాక్‌ను క్రియేట్ చేసింది. తేరే ఇష్క్ మే చిత్రం ఈనెల 28న హిందీ, తమిళం తెలుగు భాషల్లో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా కృతి సనన్ ధనుష్ సరసన నటించిన అనుభవాన్ని పంచుకున్నారు. ఆమె మాట్లాడుతూ ధనుష్ ఒక అసాధారణ నటుడని అన్నారు. పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన అనుభవం కలిగిన నటుడని అన్నారు. ఆయనతో నటించడానికి చాలా ఎగ్జైటెడ్ ఫీలయ్యానని, ధనుష్ నుంచి చాలా నేర్చుకున్నానన్నారు. ఆయనతో కలిసి నటించడాన్ని చాలా ఎంజాయ్ చేశానని అన్నారు. తమ మధ్య కెమిస్ట్రీ వర్కవుట్ అయ్యిందన్నారు. తామిద్దరం చాలా చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని టి.సిరీస్‌కు చెందిన గుల్షన్‌కుమార్, కలర్ ఎల్లో సంస్థ సమర్పణలో ఆనంద్ ఎల్.రాయ్, హిమాన్షూ శర్మ, భూషన్‌కుమార్, కృష్ణకుమార్ కలిసి నిర్మించారు.



## అది తప్పని తెలుసుకున్నా.. మన లైఫ్‌లో బెస్ట్ ఫ్రెండ్ ఎవరంటే?

టాలీవుడ్ హీరోయిన్ సమంత ప్రస్తుతం మా ఇంటి బంగారం మూవీతో బిజీగా ఉంది. ఇటీవలే పూజా కార్యక్రమాలు కూడా నిర్వహించింది. ఈ చిత్రానికి సామ్ నిర్మాత కాగా.. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అయితే కొద్దికాలంగా బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో సన్నిహితంగా ఉంటూ వార్తల్లో నిలుస్తోంది. వీరిద్దరు డేటింగ్‌లో ఉన్నారని రూమర్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఎక్కడికెళ్లినా రాజ్, సామ్ జంటగా కనిపించడంతో పాటు అత్యంత సన్నిహితంగా మెలగడంతో దాదాపు కన్‌ఫామ్ అయినట్లేనని ఆడియన్స్ భావిస్తున్నారు.

ఇదిలా ఉంటే సమంత తాజాగా సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. జిమ్‌లో వర్కవుట్ చేస్తున్న ఫోటోలను షేర్ చేసింది. అంతేకాకుండా సుదీర్ఘమైన నోట్ కూడా రాసుకొచ్చింది. ఫుల్ యాక్షన్ మోడ్.. బీస్ట్ మోడ్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. కొన్నేళ్ల క్రితం నా బ్యాక్ బలంగా లేదని వదిలేశా.. ఎందుకంటే నా జీన్స్‌లో అలా లేదని అనుకునేదాన్ని అని తెలిపింది. ఎవరినైనా అలాంటి వారిని చూసినప్పుడు.. నాకు అలా సాధ్యం కాదని అనుకుంటానని సామ్ పోస్ట్ చేసింది.

కానీ అదంతా తప్పని ఇప్పుడు తెలిసింది. నిజాయితీగా చెప్పాలంటే ప్రస్తుతం చాలా సంతోషంగా ఉన్నా.. దాన్ని ఇప్పుడు చూపించబోతున్నా.. ఎందుకంటే ఇక్కడికి చేరుకోవడానికి చాలా తీవ్రంగా శ్రమించానని సామ్ తెలిపింది. బాడీలో కండరాన్ని నిర్మించడం చాలా ముఖ్యం.. మీరు ఎలా కనిపిస్తారనే దాని కోసం మాత్రమే కాదు.. మీరు ఎలా జీవిస్తారు.. ఎలా కదులుతారు.. మీ వయస్సు ఎలా పెరుగుతుందనే దాని కోసమని తెలిపింది.

అలాగే మీ వయసు పెరిగే కొద్ది.. బలమైన శిక్షణే మీ బెస్ట్ ఫ్రెండ్‌గా మారాలని సూచించింది. ఈ బలమైన శిక్షణే నాకు అన్నింటికంటే ఎక్కువ మేలు చేసింది.. క్రమశిక్షణ, సహనం నేర్పింది.. ఇదంతా జన్యువుల వల్ల వచ్చింది కాదని అర్థమైంది. అదంతా మనం చెప్పే ఒక సాకు మాత్రమేనని తనకు తెలిసొచ్చిందని సమంత పోస్ట్ చేసింది. నువ్వు ఏదైనా వదులుకునే దశలో ఉంటే.. ఇప్పుడు అస్సలు వదులుకోవద్దు.. నువ్వు అలానే ముందుకు సాగితే నీ భవిష్యత్తు చాలా బాగుంటుందని సామ్ అంటోంది.

# హరిహర వీరమల్లు బ్యూటీ బర్త్ డే.. పది కోట్ల కారు గిఫ్ట్!

బాలీవుడ్ భామ, హరిహర వీరమల్లు నటి నర్గీస్ ఫక్రీ ఖరీదైన బహుమతిని అందుకుంది. ఆమె గతనెలలో 46వ పుట్టినరోజును జరుపుకుంది. ఈ ముద్దుగుమ్మ బర్త్ డేను పురస్కరించుకుని ఆమె భర్త టోనీ బీగ్ లగ్జరీ కారును గిఫ్ట్‌గా ఇచ్చాడు. ఈ రోల్స్ రాయిస్ కారు విలువ దాదాపు రూ.10 కోట్లకు పైగానే ఉంది. ఈ విషయాన్ని దాదాపు నెల రోజుల తర్వాత పంచుకుంది బాలీవుడ్ బ్యూటీ. సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేసింది. ఈ బాలీవుడ్ భామ పలు హిందీ చిత్రాల్లో నటించింది. హిందీలో హౌస్‌ఫుల్ 5, హౌస్‌ఫుల్ 3, మేయిన్ తేరా హీరో, రాక్‌స్టార్ చిత్రాల్లో నటించింది. ఈ ఏడాది తెలుగులో పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన హరిహర వీరమల్లు మూవీలో కనిపించింది ముద్దుగుమ్మ. తాజాగా మస్తీ4 మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చింది భామ. ఈ సినిమా ఈ రోజు నుంచే థియేటర్లలో సందడి చేస్తోంది. సినిమాలతో బిజీగా ఉండగానే టోనీని ఫిబ్రవరి 2025లో వివాహం చేసుకుంది. ఆమె భర్త టోనీ అమెరికాకు చెందిన వ్యాపారవేత్త కాగా.. కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్ హోటల్స్‌లో వీరిద్దరు వివాహం చేసుకున్నారు. ఈ వేడుకలో సన్నిహితులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మాత్రమే హాజరయ్యారు. పెళ్లికి ముందు మూడేళ్ల పాటు డేటింగ్‌లో ఉన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com